
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ఆదివారం
11.2.2024



# సింధు నదిలో పసిడి పంట

## పట్టుకు పోతున్న పాకిస్తానీయులు

## చైర్మన్‌తో ముఖాముఖి



నూకారపు సూర్యప్రకాశరావు
చైర్మన్, నేటి దిన పత్రిక సూర్య

**దేశంలో అనేక సందర్శనీయ ప్రదేశాలు ఉన్నప్పటికీ, విదేశాలకు వెళ్లాలని చాలా మంది కోరుకుంటారు. అయితే, చాలా సార్లు ప్లాన్ వేయకముందే ఫ్లాప్ అవుతుంది. ముఖ్యంగా వీసా విషయంలో సమస్యతో పర్యటన రద్దు అవుతుంది. కానీ వీసా లేకుండా కూడా విదేశీ పర్యటనకు వెళ్లొచ్చు. వీసా అవసరం లేని దేశాలు కూడా ఉన్నాయి. ఇటీవల శ్రీలంక కూడా భారతీయులకు వీసా అవసరం లేదని ప్రకటించింది. అలాగే, మలేషియా కూడా ఈ ఆఫర్ ఇచ్చింది. మీరేమంటారు సర్**

**– పట్నాన రాజశేఖర్, సింగపూర్**

మీరన్నది నిజమే రాజశేఖర్ గారూ ... భారతీయులకు వీసా మినహాయింపు ఇచ్చిన దేశాల సంఖ్య పెరుగుతోంది. తాజాగా ఆ జాబితాలో ఇరాన్ చేరింది. ఫిబ్రవరి 4 నుంచి భారతీయ పర్యాటకులు 15 రోజులపాటు వీసా లేకుండానే తమ దేశంలో పర్యటించడానికి అనుమతి ఇస్తున్నట్లు ఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయం మంగళవారం ప్రకటించింది. అయితే, నాలుగు షరతులు వర్తిస్తాయని చెప్పింది. విమాన మార్గంలో వచ్చే ప్రయాణికులకే ఇది వర్తిస్తుందని తెలిపింది. డిసెంబరులో భారత్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, ఇండోనేషియా, జపాన్, సింగపూర్, మలేషియాతో సహా 32 ఇతర దేశాల కోసం కొత్త వీసా–రహిత ప్రోగ్రామ్‌ను ఇరాన్ ఆమోదించింది. సాధారణ పాస్‌పోర్ట్‌లను కలిగి ఉన్న వ్యక్తులు ప్రతి ఆరు నెలలకు ఒకసారి వీసా లేకుండా దేశంలోకి ప్రవేశించడానికి అనుమతిస్తామని, గరిష్టంగా 15 రోజులు ఉండవచ్చని ఇరాన్ తెలిపింది. '15 రోజుల వ్యవధిని పొడిగించడం సాధ్యం కాదని గమనించాలి' అని అది పేర్కొంది. 'పర్యాటక ప్రయోజనాల కోసం ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ భూభాగంలోకి ప్రవేశించే వ్యక్తులకు మాత్రమే ఇది వర్తిస్తుంది' అని స్పష్టం చేసింది.'ఎక్కువ కాలం ఉండాలనుకునేవారు లేదా ఆరు నెలల వ్యవధిలో పలుసార్లు ప్రవేశం లేదా ఇతర రకాల వీసాలు అవసరమయ్యే భారతీయులు తప్పనిసరిగా భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం నుంచి అవసరమైన వీసాలను పొందాలి. . ఈ ఆమోదంలో పేర్కొన్న వీసా రద్దు ప్రత్యేకంగా విమానం ద్వారా దేశంలోకి ప్రవేశించే భారతీయ పౌరులకు వర్తిస్తుంది' అని తెలిపింది. గత నెల ఇరాన్‌లో పర్యటించిన భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్.. ఇరాన్ విదేశాంగ మంత్రి హొస్సేన్ అమీర్–అబ్దుల్లాహియాన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, ప్రాంతీయ అంశాలు చర్చకు వచ్చాయి.

**రాజకీయ కురువృద్ధుడు, ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌కు కేంద్ర ఎన్నికల సంఘం షాక్ ఇచ్చింది. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ.. అజిత్ పవార్‌దేనని స్పష్టం చేసింది. దేశ రాజకీయాల్లో తలపండిన నేతగా ఉన్న శరద్ పవార్‌కు షాకిస్తూ.. ఆయన సోదరుడి కుమారుడు అయిన అజిత్ పవార్‌కే కట్టబెట్టింది. ఇప్పటికే శివసేన విషయంలో ఇచ్చిన తీర్పునే ఎన్సీపీ విషయంలోనూ కేంద్ర ఎన్నికల సంఘం వెలువరించింది. దీంతో అజిత్ పవార్‌దే నిజమైన ఎన్సీపీ అని తేల్చి చెప్పింది. మారిన రాజకీయాల గురించి మీరేమంటారు.**

**– చిత్రా వెంకటేశన్, నాందేడ్**

మీరన్నది నిజమే చిత్ర గారూ... మహారాష్ట్రలో రాజకీయాలు సంచలనంగా మారుతున్నాయి. ఆ రాష్ట్రంలో చీలిపోయిన పార్టీలు ఎవరివీ అని ఆ పార్టీల్లోని చీలిక వర్గాలు చేస్తున్న పోరాటంపై కేంద్ర ఎన్నికల సంఘం సంచలన తీర్పును ఇచ్చింది. ఇప్పటికే శివసేన పార్టీని చీల్చిన ఏక్‌నాథ్ షిండేనే.. ఆ పార్టీకి అధినేత అని ప్రకటించిన కేంద్ర ఎన్నికల సంఘం.. తాజాగా నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ విషయంలోనూ అదే విధమైన తీర్పును వెలువరించింది. ఇప్పటివరకు నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న శరద్ పవార్‌కు కేంద్ర ఎన్నికల సంఘం వద్ద గట్టి ఎదురుదెబ్బ తగిలింది. నిజమైన ఎన్సీపీ అజిత్ పవార్‌దేనని తేల్చి చెప్పింది.ఎన్సీపీలోని మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతు అజిత్ పవార్‌కు మాత్రమే ఉందని ఈసీ స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే ఎన్సీపీ పేరును, అధికార గుర్తు గడియారాన్ని కూడా అజిత్ పవార్ వర్గానికే కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలోనే లోక్‌సభ ఎన్నికలకు ముందు శరద్ పవార్‌కు బిగ్ షాక్ తగిలింది. మరోవైపు త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికల దృష్ట్యా శరద్ పవార్ వర్గానికి కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక అనుమతిని ఇచ్చింది. శరద్ పవార్ గ్రూపు ఇప్పుడు కొత్త గుర్తు కోసం ఎన్నికల సంఘానికి ప్రతిపాదన పంపాల్సి ఉంటుందని తెలిపింది. ఇందుకోసం బుధవారం 4 గంటల వరకు డెడ్‌లైన్ విధించింది.

మహారాష్ట్ర రాజకీయాల్లో తొలి నుంచి శరద్ పవార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. 1999 లో అప్పటి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ వ్యతిరేకిస్తూ పార్టీ నుంచి బయటకు వచ్చారు. అనంతరం నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీని స్థాపించి.. 1999 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 2004 తర్వాత కాంగ్రెస్ పార్టీతో కలిసి కేంద్రంలోని యూపీఏ సర్కార్‌లో చేరి 2014 వరకూ కలిసే ఉన్నారు. ఆ సమయంలోనే కేంద్ర మంత్రిగా కూడా శరద్ పవార్ పనిచేశారు. ఆ తర్వాత 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తోపాటు ఎన్సీపీ కూడా తీవ్ర పరాజయం పాలైంది. 2019 చివర్లో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో శివసేన, బీజేపీ కలిసి పోటీ చేసినా.. సీఎం పదవి విషయంలో ఉద్ధవ్ ఠాక్రే, బీజేపీతో విభేదించారు. అనంతరం కాంగ్రెస్, ఎన్సీపీ, శివసేన కలిసి మహా వికాస్ ఆఘాడీ పేరుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు.అయితే వ్యూహాత్మకంగా వ్యవహరించిన బీజేపీ.. శివసేన నాయకుడు ఏక్ నాథ్ షిండే సారథ్యంలో శివసేన పార్టీని చీల్చి.. మహారాష్ట్ర ప్రభుత్వాన్ని పడగొట్టింది. ఆ తర్వాత శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీని అజిత్ పవార్ సారథ్యంలో రెండుగా చీల్చింది. అజిత్ పవార్ ప్రస్తుతం బీజేపీ–శివసేన (షిండే) సంకీర్ణ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా ఉన్నారు. మరి రానున్న రోజులలో ఏం జరగనుందో చూడాలి.

## లెజెండ్

# తెలుగు కళామ తల్లి ముద్దుబిడ్డ తిరుమలేశ్వరరావు



(గత వారం తరువాయి)

ఇందు కలరు అందులో లేరు అన్న సందేహం వలదు ఎందెందు వెతికినా తిరుమలేశ్వరరావు గారే అన్న చందాన షార్ట్ ఫిలిమ్స్ తీయడంలో కూడా అందవేసిన చేయి. అత్యధికంగా 15 షార్ట్ ఫిలిమ్స్ కి స్కిట్స్ రాసి నటించారు. వీటిల్లో "మల్లెపూలు గొల్లుమన్నవి, బొట్టు" వంటి షార్ట్ ఫిలిమ్స్ లో అద్భుతంగా నటించి ప్రేక్షకుల నీరాజనాలు అందుకున్నారు. "ఎవడ్రా ఆపేది మనల్ని" వెబ్ సిరీస్ లో కూడా నటించారు. ఇలా మానవతా విలువలకి అద్దం పడుతూ లెక్కకు మిన్నగా నాటకాల్లో, షార్ట్ ఫిలిమ్స్ లో నటించారు. సినీ వినీలాకాశంలో కూడా తిరుమలేశ్వరావు గారు ఓ వెలుగు వెలిగారు. నూతన ఒరవడికి భాష్యం చెబుతూ ఇటీవల వీరు పేరులోనే నూతనత్వాన్ని సంతరించుకున్న "వెనక్కి తిరిగి చూడకు" అనే సరికొత్త సినిమాకి శ్రీకారం చుట్టారు. విభిన్నమైన ఉత్తమ కథాంశంతో ప్రస్తుత ట్రెండుకి అనుగుణంగా కొత్త నటి నటులతో చాలా అద్భుతంగా ఈ సినిమా తీశారు. ఈ సినిమాలో వీరు నిర్మాతగా, మాటల రచయితగా, నటుడిగా తన ప్రతిభకు పట్టం కట్టారనే చెప్పాలి.

సినిమాలో కూడా వీరు ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయే ఓ చక్కని పాత్రను పోషించారు. ఫోటోగ్రఫీ అద్భుతం, అమోఘం అన్న రీతిలో ఉంది. ఈ సినిమా విడుదలకు సిద్ధంగా వుంది. ఈ సినిమాకు చక్కని టైటిల్ ని పెట్టిన తిరుమలేశ్వరరావు గారు వెండితెరపై కూడా వెనక్కి తిరిగి చూడకుండా ఆల్రౌండర్ గా ఆకాశమంత ఎత్తు ఎదిగి మరిన్ని విజయాలను సొంతం చేసుకోవాలని కోరుకుంటున్నాను.

ఇలా వీరు ఇటువృత్తికి అటు ప్రవృత్తికి సమన్యాయం చేకూరుస్తూ పంచాయతీరాజ్ ఆఫీసులో కూడా ఒక్కో మెట్టు ఎదుగుతూ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా ఉన్నత పదవిని అలంకరించి ఆ పదవికే వన్నె తెచ్చారు. ఉన్నత పదవిలో ఉన్నా కూడా తన క్రింది స్థాయి ఉద్యోగుల్ని కూడా ఎంతో ఉన్నతంగా చూస్తూ విసుగు అనేది తన మోములో ఏమాత్రం కనబడనీయకుండా మృదుమధుర భాషణంతో మాట్లాడుతూ వారితో స్నేహపూర్వకంగా మసులుకొంటూ సానుకూలంగా పనులు చేయించుకొనేవారు. ఇలా వీరు వినయ విధేయతలు, సౌమ్యత, సౌశీల్యంతో ఆ పదవికే వన్నెతెచ్చి తోటి ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచారు. ఉత్తమ ఉద్యోగిగా పేరు తెచ్చుకున్న వీరు పదవీ విరమణ చేసినా కూడా విశ్రాంతి అనే పదాన్ని దరిచేరనివ్వకుండా రెట్టింపు ఉత్సాహం, ఉల్లాసంతో కళా రంగ సేవలో మరింత మునిగి తేలుతున్నారు.

ఈ బహుముఖ ప్రజ్ఞాశాలి సాంస్కృతిక కార్యక్రమాలకి నిర్వహణ బాధ్యతలు చేపట్టి ఆయా కార్యక్రమాలకి అధ్యులు, పూజ్యులై ఆ కార్యక్రమాల్ని ముందుకు నడిపిస్తూ తన సేవలతో మరింత వన్నెతెస్తున్నారు. "యువ కళావాహిని సాంస్కృతిక సంస్థ"లో ఎడిషనల్ సెక్రటరీగా 1992 నుండి నిర్విరామంగా సేవలు అందిస్తూ ఆ సంస్థని ఉన్నత స్థానంలో నిలబెట్టారు. "ఆరాధన ఆర్ట్స్ అకాడమీ సంస్థ"లో అధ్యక్షులుగా ఉండి ఆ సంస్థకు మంచి గుర్తింపుని ఇచ్చే విధంగా ఎంతోమంది కళాకారుల్ని వెలికితీస్తూ వారి ప్రతిభకు పట్టం కడుతూ అందరికీ ఆదర్శవంతంగా నిలుస్తున్నారు. వీరి ప్రతిభకు తార్కాణంగా "వైకె తో నేను" వీరిద్దరి మధ్య వున్న చిరు జ్ఞాపకాల సవ్వడితో కూడిన ఓ చక్కని పుస్తకాన్ని తిరుమలేశ్వరరావు గారు తన సంపాదకత్వంలో ఆవిష్కరణకు రూపుదిద్దుకుంటున్న పుస్తకాన్ని త్వరలో సాహితీ ప్రియులకు కానుకగా ఇవ్వనున్నారు

తిరుమలేశ్వర రావు గారు పేరులోనే దైవాన్ని తలపింపజేస్తున్న ఈ ఆరడుగుల ఆజానుబాహుడు చిరునవ్వుల దరహాసాలు చిందిస్తూ వినయ–విధేయతలు పెట్టని ఆభరణాలుగా ధరించి కళల కాణాచిగా వెలుగొందుతున్న ఈ మానవతామూర్తి అవార్డుల పంటలను కూడా అద్భుతంగా పండించారు. విధి నిర్వహణలో భాగంగా వీరు "ఉత్తమ ఉద్యోగి"గా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రెండుసార్లు పురస్కారాన్ని అందుకున్నారు. రచన, నాటకరంగంలో కనబరిచిన ప్రతిభకు ఎన్నో పురస్కాలను అందుకొన్నారు. నాటకరంగంలో ప్రతిభకు సినీ నటులు మురళీమోహన్ గారి చేతుల మీదగా "నటశేఖర పురస్కారం, సి. నారాయణరెడ్డి తో పురస్కారం, రోశయ్య గారి నుంచి రెండుసార్లు ఉత్తమ నటుడు పురస్కారం, దర్శకత్వంలో ప్రతిభ కనపరచ్చినందుకు సినినటి కవిత గారి చేతుల మీదగా పురస్కారం అందుకున్నారు. ఇంకా 2006 సివిల్ సర్వీసెస్ నాటికల పోటీల్లో పాల్గొని హైద్రాబాద్ లో ఉత్తమ హాస్య నటుడుగా మాజీ ముఖ్య మంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరెడ్డి గారి నుండి పురస్కారం, జస్టిస్ రామలింగేశ్వరావు గారి చేతుల మీదగా, అక్కినేని నాగేశ్వరరావు గారి చేతులమీదగా ఘన సన్మానాలు అందుకొని ఆ సన్మానాలు, పురస్కారాలకే వన్నె తెచ్చారు.

ఇలా అన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తున్న ఈ నిత్య కృషివలుడు, ఉద్యోగరత్న, సద్గుణ సంపన్నులు, సాహితీ–కళా పిపాసి అపూర్వము, అనన్య సామాన్యము, ఆచంద్ర తారార్కము అన్న చందాన ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధితో చుక్కల్లో చంద్రుడిలా వెలిగిపోతూ సాహితీ కళా రంగాల్లో మరిన్ని అద్భుతాలు సృష్టిస్తూ, అందరికీ ఆదర్శంగా నిలుస్తూ ఆ చంద్రార్కం ఈ భూమ్యాకాశాలు ఉన్నంతవరకు చిరంజీవిగా వెలిగిపోవాలని కోరుకుంటూ తిరుమలేశ్వరరావు గారికి జేజేలు, వందనాలు, శుభాకాంక్షలు.

మీ కళా సేవకివే మా శతకోటి వందనాలు.

**– పింగళి భాగ్యలక్ష్మి,**
**9704725609**

## నవ కవిత్వం

### కావాలి ప్రియా !



నీలో నేనే ఉన్నానని
నీవు నాతో ఎప్పుడూ ఉంటావని
జీవిత బంధమె శాశ్వతమై
ప్రేమతో గడిపే రోజులన్ని
పదికాలాల సౌభాగ్యం సాక్ష్యమై
పెదవి చాటున పొదిగిన మన
అనురాగపు
పుష్పాల పరిమళాలు
పుప్పొడులు వెదజల్లుతుంటే
నీ రూపమే సదా
నన్ను మరువనీయక
మనసంతా నీ జ్ఞాపకాల
దొంతరలు నిరంతరం
దోబూచులాడుతుంటే


ఎలా ప్రియా!
నన్ను నేను ఆపుకోవడం
నీ సాంగత్యంలో నిండా
మునిగిన నాతనులత
నన్ను నేను మరచి నిన్నే
కావాలని
నీకు నాకు మధ్య ఓ చిన్ని....
రావాలని
రేపటి కోసం.... కావాలి ప్రియ!

**– బొమ్మిదేని రాజేశ్వరి**
**9052744215**

## లేఖలు

**ముఖచిత్ర కథనం బాగుంది**

ప్రపంచ దేశాలలో ఉరిశిక్ష అమలుపై ప్రచురించిన వ్యాసం చాలా బాగుంది. అనేక అంశాలపై సవివరంగా వివరించిన రచయిత వివి గారికి ధన్యవాదాలు , ఈ తరహా మరిన్ని వ్యాసాలు ప్రచురించాలని కోరుకుంటున్నాం. ప్రచురించిన ఎడిటర్, యాజమాన్యాలకు ధన్యవాదాలు. సందర్భానుసారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసా లు రాయించి ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి కృతజ్ఒతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుం టుంది. భాషను మర చిపోయి బావ దారిద్రంలో ఉన్న వారికి ఉపయోగ పడుతుందని నా మనవి. **–బి మధుశేఖర్, హైదరాబాద్**




**ఘుమఘుమలు అదురుతున్నాయి**

వారం వారం భాగ్యలక్ష్మి వివిధ రకాలైన వెరైటీ వంటలు రాస్తూ, ఆరో పేజీని ఘుమఘుమలాడి స్తు న్నారు. ఆరోగ్యం, ఆనందం సమ్మి ళితంగా ఆమె చేస్తున్న ప్రయోగా లకు ధన్యవాదా లు. ఆమె నుంచి మరిన్ని కొత్త వంటల రుచులను కోరుకుంటు న్నాం. స్వీట్లు, స్నేక్స్ తయారీలోనూ కొత్త కొత్త రుచులను పరిచయం చేయాలను ఆశిస్తున్నాం.
**– వారాంతపు రజనీ, వరంగల్**

**సినిమా రివ్యూలు బాగున్నాయ్**

వారం వారం విడుదలవుతున్న చిత్రాలలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుణుల పనితీరును అర్ధవంతంగా వివరి స్తున్న విశ్లేషకులకు ధన్యావాదా లు. ప్రధానంగా థియేటర్లలోకి రాకుండా ఓటిటికే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.
**– ముక్కామలపద్మావతి, హైదరాబాద్**
**–శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**

**కథలు బాగున్నాయి**

వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరందిస్తున్న ప్రోత్సాహం బాగుంది. అలాగే ధారావాహిక మెచ్చు కోలు గా ఉంది. రచిత కథనా న్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచనలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు
**– జి. సర్వేశ్వరరావు, తెనాలి**

## మంచి నడక దారి



రోజూ పెందలాడే పార్కు నను
తోడ్కొని వెళ్తుంది
చుట్టూవున్న చెట్ల పలకరింపు స్పర్శ
నడకలో వేగం పెంచుతుంది...
నిత్యం ఎవరో ఒకరు పడేసే
ప్లాస్టిక్కవరు
మధ్యన వచ్చి ఎపుడూ మాటాడిస్తూనే
వుంటుంది...


ఒక్కోసారి నాకనిపిస్తుంది –
పార్కులోని మేమంతా ఒక్కసారిగా
పైకెళ్లిపోతే?
పుడమికేమైనా నష్టమా!
వుంటే ధరణికేమైనా లాభమా!!
ఎందుకు మము నిత్యం మోస్తున్నట్టు?


నేనే కాదు ఇదిగో వీరందరూను
నిత్యం నడిచే నడక
వ్యాయామం ప్రాణాయామం యోగ
వయసుని తగ్గిస్తూ మా ఆయుష్షుని
పెంచేస్తూ.......
నిజానికి భూమికి
సేవ చేసేవానికే కదా
మరింత ఎక్కువ కాలం
భూమిపై వుండే నైతిక హక్కు !!!


మొదట :
ప్లాస్టిక్ భూతాన్ని మట్టికుండలో
మూసేద్దాం
విరివిగా మొక్కల నాటేద్దాం
కాలుష్య కారకాల అంతు చూద్దాం...

పర్యావరణ పరిరక్షణే ఊపిరిగా
బతుకుదాం
ఆ మంచి నడక దారి మళ్లీ మళ్లీ
నడుద్దాం....
బుడి బుడి నడకలకు ఆకుపచ్చ బాట
పరుద్దాం...


**– అశోక్ గుంటుక**
**9908144099**



# సూర్య బుడత



**బాలల కథ**

## సమ భావన




గాంధీ నగర్ లో రామ్మోహన్ ధనికుల్లో ఒకడు. అతని కొడుకు శ్రీకాంత్. కొడుకుని అల్లారు ముద్దుగా పెంచాడు రామ్మోహన్. శ్రీకాంత్ ఏది అడిగితే అవి కొని పెడుతూ ఉంటాడు తండ్రి... ప్రతీరోజూ శ్రీకాంత్ ధనికులుతో వారి వారి పిల్లలతో తిరగడం, ఆడడం ఇంకా స్కూల్ కి వెళ్లడం ఇది వాడి జీవన విధానం. ఒకరోజు తండ్రి సెల్ఫోన్ (చరవాణి) కొని వాడికి ఇచ్చారు. అప్పటినుండి బడిలోని పేద పిల్లలంతా శ్రీకాంత్ చుట్టూరా తిరుగుతూ ఉంటారు. ఇంతవరకు ధనికులే స్నేహితులు, ఇప్పుడు పేద పిల్లలు కూడా స్నేహితులు అయ్యారు శ్రీకాంత్ కి.......

.దనికుడైనా అహంకారము లేని మంచి బాలుడుశ్రీకాంత్.. అప్పుడప్పుడు పేద స్నేహితుల ఇంటికి వెళుతూ ఉండేవాడు శ్రీకాంత్. వారి వారి జీవన విధానం గమనిస్తూ దేవాడుశ్రీకాంత్. పేదస్నేహితులకి తిండి, బట్టలు సరిగా ఉండేవి కావు.


వారిని చూసి జాలి పడేవాడు శ్రీకాంత్. ఇలా ఉండగా, తండ్రి రామ్మోహన్  శ్రీకాంత్ కి ప్రతి సంవత్సరం పుట్టినరోజు ఒక పండగల జరుపుతారు. ఈసారి తండ్రితో శ్రీకాంత్ తన పేద స్నేహితులందరినీ పిలుస్తాను అంటాడు. దానికి తండ్రి చాలా ఆనందించి వారందరినీ పిలుస్తారు వారందరి కి భోజనాలు, బట్టలు పెడతాడు శ్రీకాంత్. స్నేహితులంతా చాలా సరదాగా గడుపుతారు అది చూసి శ్రీకాంత్ చాలా ఆనంద పడతాడు. ఆనాటి నుండి అతను మనసులో ప్రతిధనికుడు పేదవారిని ఆదుకుంటే బాగుండును అని ఆలోచిస్తాడు అలా కొంతకాలానికి తన చదువు పూర్తి చేసుకుని ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకి వెళ్తాడు శ్రీకాంత్ .అతడికి ఉద్యోగం రాలేదు. ధనికుడైన తండ్రి రామ్మోహన్ ఒక పెద్ద పరిశ్రమను స్థాపించి. శ్రీకాంత్ ని మేనేజర్ గా చేస్తాడు. అప్పుడు శ్రీకాంత్ వేలవేల మంది పేదలకు తన ఇండస్ట్రీలో ఉద్యోగాలు ఇచ్చి తన పేద స్నేహితులందరికీ అండగా నిలుస్తాడు. శ్రీకాంత్ ఇలాంటి పరిశ్రమలు ఎన్నో పెట్టి పేదవారికి అండదండగా ఉండి తండ్రి చేత శభాష్ అనిపించుకుంటాడు.

.. ధనికులు చదువుతోపాటు సమాజంలో సమ భావనతో మంచి మనసుతో పేదవారిని ఇలా ఉద్ధరించవచ్చు....

**బళ్ల కృష్ణ వేణి**
**93989 05803**









## మంచిమాట

కూరలో కారం ఎక్కువైతే తినడానికీ మాటలో వెటకారం ఎక్కువైతే వినడానికీ కష్టంగా ఉంటుంది.

# దేవుడి భార్య



## సరికొత్త సీరియల్

(గతవారం తరువాయి)

అమ్మవారు ఆగ్రహించి ఈసరయ్యను ముక్కలు ముక్కలుగా చేసిందని చెప్పమన్నారు. వాళ్లు చెప్పినట్టే పూజారి ఊరి ప్రజలకు చెప్పాడు. ఈసరయ్య మాత్రమే కాదు ఇంకా చాలామందిని అమ్మవారు బలి తీసుకుంటానని చెప్పిందని చెప్పాడు. పూజారి మాటలు విన్న ప్రజలు ఈసరయ్యను తిట్టుకున్నారు, ఊరి శని వదిలిందనుకున్నారు, అమ్మవారు మంచి శిక్ష వేసిందని మొక్కుకున్నారు, ఊరిని కాపాడమని వేడుకున్నారు.

పూజారి ఎందుకు అలా చెప్పాడో ఊరి పెద్దలకు అర్థం కాలేదు. తమని కూడా అమ్మవారు చంపుతుందేమోనని భయపడ్డారు, ఊరు వదిలి పారిపోవాలనుకున్నారు. పాపం పండటం అంటే ఇదేనేమోనని బెత్తుకున్నారు. అందరూ వెళ్ళిపోయిన తర్వాత 'నిజంగా అమ్మవారే చంపిందా? లేదంటే ఎవరైనా చంపినారా?' అని ఊరి పెద్దలు అడిగారు.

'నా కళ్లతో చూసినా! ఇంటి ముందు ఏదో గజ్జల చప్పుడు అయితే అర్ధరాత్రి లేసిన వెంట్రుకలు విరబోసుకొని, నుదుటి మీద రూపాయంత బొట్టు, నల్లగా, కోపంగా, ఆవేశంగా, ఉప్పెనలా, ఉగ్రంగా నడుచుకుంటూ వెళ్ళడం చూసి నేను కూడా వెనుకే వెళ్ళాను. ఆ మహా తల్లి ఈసరయ్యను తన ఖడ్గంతో ముక్కలు ముక్కలు చేసింది. ఆ తర్వాత శాంతపడి విషయాన్ని వివరంగా నాకు చెప్పింది.'

'అయితే మేము ఊరు వదిలి వెళ్లిపోతాము.'

'మీరు ఎక్కడున్నా ఆ తల్లి వస్తుంది. ఆ తల్లిని వేడుకోవడం తప్ప వేరే దిక్కు లేదు. నేను ఇన్ని రోజుల నుండి పూజలు చేస్తున్న కనుక నన్ను వదిలేసింది.'

ఊరి పెద్దలు బిక్కుబిక్కుమంటూ ఇంటికి చేరుకున్నారు. రాత్రిళ్లు పడుకోవడం మానేశారు. కన్ను రెప్ప వేస్తే ఆ మహా తల్లి చంపుతుందేమోనని వణికిపోయారు.

నాలుగు రోజులు గడిచింది, పది రోజులు గడిచింది అమ్మవారు ఎవరినీ చంపలేదు. తమని క్షమించిందనుకున్నారు. అందరం కలిసి అమ్మవారికి జాతర చేద్దాం అనుకున్నారు. అనుకున్నట్లే జాతర తేదీలను దండోరా వేయించినారు.

రెండు రోజులు పాటు అమ్మవారికి అంగరంగవైభవంగా జాతర జరిగింది. మూడవ రోజు కోబలి. కోబలి అంటే మూడవ రోజు ఒక మేకపిల్లను కోసి దాని పొట్ట పేగులను చాటలోకి ఎత్తుకొని, లేత దూడ యొక్క గుండెకాయను నోట్లో పెట్టుకొని ఊరంతా రక్తాన్ని చల్లడం. ఈ తతంగం అంతా ఊరి పెద్దల సమక్షంలో ఆసాదుల మల్లన్న చేస్తాడు.

ఊళ్లో అందరూ దీపాలు ఆర్పేసినారు. డబ్బులు, వాయిద్యాలు నడుమ మల్లన బట్టలు విప్పి బిత్తలైనాడు. బలిపిల్లను నరికి దాని రక్తాన్ని మలన్న శరీరం మొత్తం పూశారు. మల్లన్న బాగా తాగి మత్తులో ఉన్నాడు. తాగకపోతే చాట ఎత్తుకొని ఊరంతా తిరగడం కుదరదు. అందుకే మల్లన్నకు బాగా తాపినారు. పొట్ట పేగులను మెడలో వేసినారు, చేతికి పెద్ద ఖడ్గం ఇచ్చినారు, యాపాకుల దండ వేసినారు, నోట్లో గుండె, కాలేయం పెట్టినారు. అమ్మవారి ముందు ఎగిరినాడు మల్లన్న. అమ్మవారిని పచ్చి బూతులు తిట్టినాడు.

ఏమే లంజా? ఎందుకు అంతగా నవ్వుతున్నావు? నీ ముక్కు పుడక నాకు ఇయ్యవా? దొంగముండ బాగా కులుకుతున్నావే? నీయమ్మ నా దగ్గరకు వస్తే కోస్తా పరంబోకు దానా అని తిట్టి అమ్మవారి విగ్రహం ముందు ఎగిరినాడు. (ఇది నిజంగా జరుగుతుంది జాతరలో, ఆసాదుల కులం వాళ్లు అమ్మవారిని పచ్చి బూతులు తిడతారు, అలా తిడితే అమ్మవారికి ఇష్టమని, ఆనందంగా భావిస్తుందని రాయలసీమ ప్రాంతాల్లో ప్రజలు నమ్ముతారు, అదొక మూఢ విశ్వాసం).

మల్లన్నకు రెండు వైపులా ఇద్దరు వ్యక్తులు నిలబడినారు. మల్లన వెనుక ఊరి పెద్దలు, ఆ వెనుక కొంతమంది ఊరి ప్రజలు నడుస్తారు. మల్లన్నకు ఎవరైనా ఎదురొస్తే చేతిలో ఉన్న కత్తితో పొడిచి చంపుతాడు. అందుకే మల్లన్నకు ఎవరూ ఎదురు వెళ్లారు. ఈ తతంగం అంతా తెల్లవారు జాము లోపు అయిపోవాలి. మల్లన్న తూగుతూ, తూలుతూ కోబలి కోబలి అని అరుచుకుంటూ పరుగు లాంటి నడకతో నడిచాడు, నెత్తి మీద కోబలి చాటలో బలిపిల్ల పేగులు, మెదడు ఉంటాయి. ఆ చాట కిందపడితే ఊరికి అరిష్టం, ఊరు వల్లకాడు అవుతుంది. అందుకే మల్లన్నకు రెండు వైపులా ఇద్దరు మనుషులు మల్లన్న కింద పడకుండా చూస్తూ ఉంటారు.

ఆ సమయంలో మల్లన్నకు అమ్మవారు పూనుతుందని ఊరి ప్రజల నమ్మకం. అలా ఊరంతా నడుస్తున్నప్పుడు దుష్టశక్తులు మల్లన్న రూపంలో ఉన్న అమ్మవారిని చూసి భయపడతాయి, పరుగు తీస్తాయి, గుడిసెల్లోకి దూరుతాయని గుమ్మాలకు మేకులను కొట్టుకుంటారు.

మల్లన్న పెద్దబజారు నుండి లోటరిపురం వైపు నడిచాడు. ఆ తర్వాత శ్రీనివాస హాలు పక్క వీధి నుండి గుంతబజార్ మిట్ట మీదుగా వెళ్ళాడు. సరిగ్గా పూల అంగళ్ళ దగ్గరికి వచ్చే లోపు ఆగిపోయాడు. కోబలి, కోబలి అని గట్టి గట్టిగా అరిచాడు, అలా మల్లన్న నిలబడినాడంటే అక్కడ ఏదో దుష్టశక్తి మల్లన్నకు అడ్డుపడిందని అర్థం. వెంటనే ఒక చిన్న మేకపిల్లను నరికి రక్తం చల్లినారు. కాసేపటికి మళ్ళీ నడవడం మొదలు పెట్టినాడు.

మల్లన్న కోంటోళ్ల వీధికి చేరుతానే ఎదురుగా జుట్టును విరబోసుకొని, రూపాయంత ఎర్రటి బొట్టు పెట్టుకొని, ముఖమంతా నల్లగా, మెడలో యాపాకుల, పుర్రెల దండతో అమ్మవారు ఎదురొచ్చింది. పూజారి చెప్పిన పోలికలతోనే ఉండటంతో చాట కింద వేసి పరిగెత్తినాడు మల్లన్న.

చీకట్లో ఎవరికీ ఏమీ కనపడటం లేదు. అమ్మవారి ముఖం మాత్రమే కనపడుతోంది, భయంకరంగా, ఉగ్రంగా ఊగి, ఊరి పెద్దల వైపు పరిగెత్తి తన పదునైన కత్తితో పొడిచింది, ఆ తర్వాత మెడ నరికింది, రెండవవాడిని కింద పడేసి గొంతు కోసింది, మూడవ వాడి పొట్టలోకి కత్తి దింపి రక్తాన్ని బయటకు తీసింది.

మల్లన్న వెనుక ఉన్న ప్రజలంతా ఎట్ల పడితే అట్ల పరిగెత్తినారు. ఊరి పెద్దలను తరిమి తరిమి నరికింది. కొంతమంది గుడిసెల్లో నుండే చూసి అమ్మవారిని మొక్కుకున్నారు. అమ్మవారి అరుపులు విని కొంతమంది బిగుసుకుపోయారు. అలా ఒక గంట సమయంలో ఆరు మందిని చంపింది అమ్మవారి రూపంలో ఉన్న నడిపమ్మ.

తెల్లవారగానే ప్రజలంతా ఊరి పెద్దల శవాల ముందు గుమిగూడారు. అమ్మవారు ఇంతెత్తు ఉందని కొందరు, అమ్మవారి చేతిలో కత్తి ఉందని, కొడవలి ఉందని కొందరు గొడవపడ్డారు. రాత్రి వచ్చింది అమ్మవారు కాదని దుష్టశక్తి అని కొందరు.. కాదని మరికొందరు పంద్యాలు వేసుకున్నారు.

గుంపులు గుంపులుగా మాట్లాడుకుంటున్నారు, కొట్లాడుకుంటున్నారు, వారి సమస్యలు, బాధలు, కష్టాలు, నష్టాలు, అప్పులు సొప్పులు ఏది పట్టించుకోవడం లేదు. ఇప్పుడు ఊరి ప్రజలందరికీ ఒకటే సమస్య రాత్రి వచ్చింది అమ్మవారా? కాదా? ఆ సమస్య ముందు వారి కుటుంబ సమస్యలు చాలా చిన్నవిగా కనపడ్డాయి. అసలు వాళ్ల సమస్యలు సమస్యలే కాదనుకున్నారు. రాత్రి జరిగిన విషయం గురించి మాట్లాడకపోతే అన్నం పోవడం లేదు. ఒక పూట అన్నం తినకపోయినా ఫర్వాలేదు ఆ చర్చలో, గుంపులో ఉండాలనుకున్నారు.

ఊరి మగాళ్లు ఒకవైపు, ఆడోళ్లు మరోవైపు, చిన్న పిల్లలు ఒకవైపు ఎవరికి తోచింది వారు చెప్పారు. కొందరు అవును నిజమేనని నమ్మారు, కొందరు వాదులాడారు. ఎవరో పోలీసులకు చెప్పినట్లు ఉన్నారు. శవాల చుట్టూ గీతలు గీశారు. తాడు కట్టారు. కాసేపటికి శవాలను ఎత్తుకెళ్ళిపోయారు. ఈసరయ్య, ఊరి పెద్దల మరణంతో ఊళ్లో దేవుడికి పెళ్లి చేయడాలు ఉండవనుకున్నారు. రెండు నెలల తర్వాత పూజారి కూడా గుడి వెనుక వైపు రక్తం కక్కుకోని చనిపోయాడు. అమ్మవారే చంపిందని కొందరు, ఎవరో కొట్టి కొట్టి చంపారని మరికొందరు అనుకున్నారు.

మూడు నెలల తర్వాత నడిపమ్మ, సీతవ్వ, రామక్క, అనసూయ, లచ్చుమ్మను పోలీసులు తీసుకెళ్లారు. ఆరు నెలల తర్వాత ఊరిలో జరిగిన హత్యలు వాళ్లే చేశారని నిర్ధారించారు. నలుగురికి జీవిత ఖైదు పడింది.

మా బతుకులు నాశనం చేసినవారిని చంపినాము, దేవదాసి పేరుతో మమ్మల్ని వేశ్యలుగా మార్చారని కోర్టుకు చెప్పుకొని వెక్కి వెక్కి ఏడ్చారు.

ఆ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యింది. అనేక మంది సంఘసంస్కర్తలు దేవదాసి విధానాన్ని రూపుమాపడానికి అనేక రకాలుగా కృషి చేశారు, పోరాటాలు చేశారు. ఆ తర్వాత దేవదాసి నిషేధ చట్టాలు అమలులోకి వచ్చాయి. ఇక తమ బతుకులు మారిపోతాయని, అందరిలాగే తాము కూడా ఆనందంగా బతకచ్చని సంతోషంగా జైలుకు వెళ్లారు. వాళ్లు జైలులో ఉన్నా వాళ్ల లాంటి ఎందరో ఆడవాళ్లకు విముక్తి కలిగిందని ఆశపడ్డారు'

పదహైదు సంవత్సరాల తర్వాత సత్ప్రవర్తన కింద నలుగురిని జైలు నుండి విడుదల చేశారు. వాళ్లు జైలుకు వెళ్ళినప్పుడు బయటి సమాజం చాలా వెనకబడి ఉందని భావించారు, అప్పటి ప్రజలు చాలా అమాయకంగా ఉండేవారని, ఇప్పుడు మొత్తం మారిపోయిందని, వాళ్లు కూడా సుఖంగా ఉండవచ్చని సంబరపడ్డారు.

జైలు నుండి బయటకు వచ్చిన వెంటనే నడిపమ్మ కూతురు, కొడుకు తల్లి కోసం జైలు దగ్గరకు వెళ్లారు. ఇద్దరూ కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నామని, పెళ్లి చేసుకోలేదని, పెళ్లి చేసుకోడానికి ఎవరూ ముందుకు రాలేదని, ప్రభుత్వం నుండి దేవదాసి పిల్లలకు ఎలాంటి సహాయ సహకారాలు లభించడం లేదని, ప్రభుత్వం నుండి ఎలాంటి గుర్తింపు కార్డు కూడా ఇవ్వలేదని, చదువుకోడానికి వెళ్తే మీ నాయన ఎవరని? గేలి చేస్తున్నారని అందుకే చదువుకోలేదని, ఇక్కడ బతకడం కన్నా చావడమే నయమని, ఎన్ని చట్టాలు వచ్చినా ఇంకా చాలామంది దేవదాసిలుగా మారుతున్నారని, చెల్లి కూడా దేవదాసిగా మారిందని, నేను పొలం పనులు చేయడానికి వెళ్తున్నానని నడిపమ్మ కొడుకు నడిపమ్మకు చెప్పి భోరున ఏడ్చాడు.

***

రాష్ట్ర వ్యాప్తంగా ఇంకా వేల మంది దేవదాసీలు కష్టాలు పడుతున్నారని, వందల మంది దేవదాసీలుగా మారుతున్నారని, తెలంగాణ, బెంగళూరు, తమిళనాడు, రాయలసీమ ప్రాంతాల్లో ఎక్కువగా దేవదాసి వ్యవస్థ ఉన్నదనే సమాచారాన్ని తెలుసుకుంది నడిపమ్మ.

దేవదాసి విధానం చట్టరీత్య నేరమైనా చాలామంది దేవదాసీలుగా మారడం ప్రజల మూఢనమ్మకాలు, మూఢవిశ్వాసాలే కారణమని గ్రహించింది. ప్రజలను చైతన్య పరచడానికి పల్లె పల్లె, వాడ వాడ తిరిగి దేవదాసి విధానం తప్పని, ఆడవాళ్లకు అదొక శిక్షని చెప్పాలనుకుంది.

తన స్నేహితులతో కలిసి ఒక ప్రణాళికను ఏర్పాటు చేసుకుంది. ప్రజల్లో ఉన్న మూఢనమ్మకాన్ని మొదట తీసివేయాలి. ఆ తర్వాత దేవదాసీల బాధలను, అవసరాలను, కష్టాలను తెలుసుకొని పోరాడాలని అనసూయ, సీతవ్వ, రామక్క, నడిపమ్మ, లచ్చుమ్మ నిర్ణయించుకున్నారు.

అనంతపురం జిల్లాలో కొన్ని ప్రాంతాలు, కర్ణాటక రాయలసీమ సరిహద్దు గ్రామాల్లో దేవదాసీలు ఎక్కువగా ఉన్నారని తెలుసుకొని అక్కడికి వెళ్లారు. ఉద్దేహళ్ గ్రామాన్ని మొదట సందర్శించారు. దేవదాసీలను ఒక చోటకు చేర్చి దేవదాసీలుగా మీరు అనుభవించిన, అనుభవిస్తున్న నరకం చాలు. మీ పిల్లలను అదే నరకంలో వేయకండని వివరించారు.

బసివి, మాతంగి, దేవుడి భార్య లాంటి పేర్లతో పిలవడం అక్కడి ఆచారం. ఉద్దేహళ్ గ్రామంలో సుమారుగా నాలుగు వందల మంది దేవదాసీలు ఉన్నారు. ఇప్పుడు మేము దేవదాసీలు కాదని వేశ్యలమని కొందరు, ఒంటి మీద బట్టలు లేకుండా కొడుతున్నారని కొందరు, మా పిల్లలను చదివించడానికి బడి లేదని, మాకు ప్రభుత్వం నుండి గుర్తింపు కార్డు లేదని, ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయ సహకారాలు అందడం లేదని, వృద్ధాప్య పింఛన్ ఇవ్వడం లేదని, వికలాంగులకు పింఛన్ అందలేదని, ఓటర్ గుర్తింపు కార్డు, బియ్యం కార్డు లేదని, మా పిల్లలకు ఉద్యోగ అవకాశాలు రావడం లేదని, ఉండటానికి ఇల్లు లేదని, ప్రభుత్వ పథకాలేమీ అందడం లేదని, బతకడానికి ఏదైనా సహకారం ప్రభుత్వం ఇస్తే ఈ నరకకూపం నుండి బయట పడతామని, కుల ధృవీకరణ పత్రం కూడా లభించడం లేదని సమస్యల చిట్టా విప్పారు.

మూఢనమ్మకం మాత్రమే కాదు పొట్ట కూటి కోసం కూడా దేవదాసీలుగా మారుతున్నారని, కరువు ప్రాంతమైన అనంతపురంలో వ్యవసాయం చేసుకోలేక, ఎలాంటి ఉపాధి అవకాశాలు లేక, ప్రభుత్వాల నుండి ఎలాంటి సహకారాలు అందకపోవడం వల్ల కూడా దేవదాసీలుగా మారుతున్నారని తెలుసుకున్నారు.

ఉలిగమ్మ, యలమ్మ, పెన్నోబిలేసు, హనుమంతరాయుడు లాంటి పేర్లతో చిన్న పిల్లలను కూడా దేవదాసీలుగా మారుస్తున్నారని, చదువుకోవాలనే ఆశ పిల్లలకు ఉన్నా కూడా ఆర్థిక కారణాలతోనే పిల్లలను దేవదాసీలుగా మారుస్తున్నారనే విషయం తెలుసుకొని కన్నీళ్లు పెట్టుకున్నారు నడిపమ్మ గుంపు.

దేవదాసి వ్యవస్థ వెళ్లిపోవాలంటే మొదట వారి సమస్యలు పరిష్కరించాలి. సమస్యలను పరిష్కరించాలంటే తమతో కుదిరే పని కాదనుకున్నారు. ప్రతి జిల్లా, మండల ప్రాంతం నుండి కొంతమంది దేవదాసీలను ఎంచుకొని వారికి వివిధ రకాలైన ఉపాధి శిక్షణ ఇప్పించడం, తద్వారా వారు ఇతర దేవదాసీలకు శిక్షణ ఇస్తే ఎవరి కాళ్ల మీద వాళ్లు నిలబడతారని, మహిళలకు ఆర్థిక స్వతంత్రం లభిస్తే, పురుషుడిపై ఆధారపడకుండా బతకగలిగితే దేవదాసీలుగా మారరని నడిపమ్మ ఆలోచన.

వెంటనే కొంతమంది దేవదాసీలను ఎంచుకొని జాకెట్లు కుట్టడం, కుట్లు, అల్లికలు, గంపలు అల్లడం, చీరలు నేయడం, ఆధునికంగా కుండలు తయారు చేయడం, తిను బండారాలు తయారు చేసి అమ్మడం, బొమ్మలు తయారు చేయడం ఇలా అనేక రకాల రంగాలపై శిక్షణ ఇప్పించారు. శిక్షణ తీసుకున్న వారు ఇతర దేవదాసీలకు వాటిపై శిక్షణ ఇచ్చేలా ఏర్పాటు చేశారు.

శిక్షణ అయితే తీసుకున్నారు కాని వాటిని అమలు చేయాలంటే డబ్బు అవసరమయ్యింది. బయట ఎవరినైనా అడిగితే మిమ్మల్ని ఎలా నమ్మాలని? దేవదాసీలకు డబ్బు ఇచ్చేది లేదన్నారు.

నడిపమ్మ తనకు ఉన్న భూమిని అమ్మి మొదట పెట్టుబడిగా పెట్టింది. అది కొంత మందికి మాత్రమే సరిపోయింది. ఎక్కువ మంది జీవితాలు మారాలంటే ప్రభుత్వం నుండి ఆర్థిక సహకారం తప్పనిసరని తెలుసుకొని కొంతమంది ప్రజా ప్రతినిధులను కలిసింది. వారు హామీ అయితే ఇచ్చారు కాని అమలు పరచలేదు.

(మిగతా వచ్చేవారం)

రచన : జానీ తక్కెడసిలా
7259511956



# అజరామరం ఆ గానం

## ఫిబ్రవరి 11... ఘంటసాల వర్ధంతి

భారతావనిలో ఎందరో గాయకులు ఉద్భవించారు. ఎందరో అవార్డులు, రివార్డులు అందుకున్నారు. కాని సంగీత ప్రియుల హృదయాలలో సుస్థిర స్థానాన్ని పొందిన ఘనత ఘంటసాల మాస్టారుకే దక్కుతుంది. ప్రముఖ గాయకులుగా, తెలుగు సినీ సంగీత దర్శకులుగా, జైలు కెళ్ళిన స్వాతంత్ర్య సమర యోధులుగా ఎనలేని కీర్తినార్జించిన గాన గంధర్వుడు తెలుగువాడు కావడం గర్వకారణం. 1922 డిసెంబర్ 4న గుడివాడ సమీప చౌటపల్లి గ్రామంలో ఘంటసాల సూర్యనారాయణ, రత్నమ్మలకు జన్మించిన వేంకటేశ్వరరావు నామాంకితుడైన ఘంటసాల, బాల్యం నుండే సంగీతం పట్ల మక్కువ కలిగి ఉన్నారు. కచేరీలలో తండ్రి మృదంగం సహకారం అందించడానికి వెళుతూ, కుమారుడిని భుజంపై ఎత్తుకుని పాటలు పాడుకుంటూ తీసుకెళ్ళేవారు. కచేరీలలో నాట్యం చేస్తూ, బాల భరతుడు అనిపించు కున్నారు, తాము గొప్ప సంగీత విద్వాంసుడు కావాలనే తమ 11వ ఏట మరణించిన తండ్రి ఆకాంక్షను సాకారం చేయ దృఢ సంకల్పులై, ఒకసారి ఒక సంగీత కచేరీలో పోటీపడి ఓటమి చెందగా, పట్టుదల మరింత పెరిగి, గురుకులాలలో చేరి, కట్టుబాట్లకు తట్టుకోలేక తిరిగి వచ్చేసారు. కొందరు విద్వాంసుల ఇళ్ళల్లో బట్టలుతికి, వంటచేసి, సంగీతా భ్యాసం చేసి, తర్వాత తమ దగ్గరున్న నలభై రూపాయల విలువైన బంగారు ఉంగరాన్ని కేవలం ఎనిమిది రూపాయలకే విక్ర యించి, ఆంధ్రరాష్ట్రంలోని ఏకైక సంగీత కళాశాల ఉన్న విజయ నగరానికి చేరుకున్నారు. రోజుకో ఇంటిలో భోజనం చేస్తూ, జోలెకట్టి అడుక్కుంటూ, ఎల్లమ్మ గుడిలో తల దాచుకున్న ఘంటసాలను పట్రాయని సీతారామశాస్త్రి యాదృచ్ఛికంగా చూడడం, తన ఇంట ఉచితంగా శిక్షణ నివ్వడానికి శాస్త్రి అంగీకరించడం ఘంటసాల జీవితాన్ని మలుపు తిప్పిన సంఘటన. పేదవాడైన శాస్త్రి, ఘంటసాలకు మధూకర (ఉంఛ వృత్తి) నేర్పించారు. తర్వాత కళాశాలలో చేరి, 4ఏళ్ళ కోర్సును రెండేళ్లకే పూర్తి చేశారు. కొన్నాళ్ళు విజయ నగరంలో కచేరీలు చేసి స్వగ్రామం చౌటపల్లికి చేరుకుని, ఉత్సవాలలో, వివాహ తదితర సందర్భాలలో గాన కచేరీలు చేసి, పాఠాలు నేర్పారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని, రెండేళ్ళు అలీపూర్ జైల్లో కఠిన కారాగార శిక్ష అనుభవించారు. 1944 మార్చి 4న తమ మేనకోడలు సావిత్రిని పరిణయమాడారు. తమ వివాహ సందర్భంలో స్వయంగా సంగీత కచేరీ చేశారు. అత్తవారి ఊరిలో సముద్రాల రాఘవాచారిని కలవగా, ఆయన సూచనపై, రెండు మాసాలు కచేరీలు చేసి, సమకూర్చుకున్న డబ్బుతో, అప్పు చేసి మద్రాసుకు చేరుకున్నారు. రాఘవాచారి ద్వారా నాటి సినీ ప్రముఖులైన చిత్తూరు నాగయ్య, బి.ఎన్.రెడ్డిల సమక్షంలో పాటలు పాడి,



ప్రశంసాపాత్రు లైనారు. పానగల్ పార్కులో నిద్రిస్తూ సముద్రాల చొరవతో మద్రాసు రేడియో కేంద్రంలో లలిత సంగీత గాయకునిగా అవకాశం పొందారు. కొన్ని గీతాలు రచించి, స్వరకల్పన చేసి, స్టేషన్ ద్వారా పాడారు. తర్వాత కాలంలో భువన విజయం పేరుతో వాటిని గ్రంథస్థం గావించారు. సినిమాలలో చిన్నచిన్న వేషాలు వేసారు. "స్వర్గసీమ" చిత్రంలో తొలిసారి నాగయ్య, బి.ఎన్.రెడ్డిలు అవకాశం ఇవ్వగా, భానుమతితో పాడిన పాటకు 118 రూపాయల పారితోషికం పొందారు. భానుమతి రామకృష్ణలు తీసిన రత్నమాల చిత్ర సహాయ సంగీత దర్శకత్వ అవకాశం పొంది, తర్వాత బాలరాజు, మనదేశం లకు సంగీత దర్శకులైనారు. 1951లో విడుదలైన "పాతాళ భైరవి" ఘన విజయం ఘంటసాలకు ఎనలేని పేరు తెచ్చి పెట్టింది. మల్లీశ్వరి తర్వాత 1953లో దేవదాసు, 55లో అనార్కలి, 57లో మాయాబజార్ లాంటి హిట్ సినిమాలు ఘంటసాలను సాటిలేని మేటి గాయకునిగా నిలబెట్టాయి. 1970 వరకూ హీరో లకు, విలన్లకు, కమేడియర్లకు పాడిన ప్రతి పాటా మాస్టరుదే కావడంతో ఆయన సినీ సంగీత సామ్రాజ్యానికి మకుటం లేని మహారాజయ్యారు. 1970లో పద్మశ్రీ పురస్కారం గ్రహించారు. 71లో ఐరోపా, ఆమెరికాలలో ప్రదర్శనలు నిర్వహించారు. ఆరోగ్యం క్రమేపీ క్షీణించి చివరకు 1974 ఫిబ్రవరి 11న యావదాంధ్ర సంగీత ప్రియులను శోకసంద్రంలో ముంచి, స్వర్గస్తులైనారు. కరుణశ్రీ, జాషువా, మల్లాది రామకృష్ణశాస్త్రి వంటి వారి ప్రశంసలకు పాత్రులై, వారి రచనలను వీధి పాటలుగా, నూతన ఒరవడితో శైలితో పద్యాలుగా, సామాన్య జన బాహుళ్యానికి అందుబాటులోకి తెచ్చిన ఘనత మాస్టారుడే. సాంప్రదాయ సంగీతానికి భంగం వాటిల్ల నీయకుండా, సామాన్య సంగీత ప్రియులకు సైతం హృదయ రంజకంగా పాడిన "శేషశైలావాసా", "ఏడు కొండ స్వామి", రహస్యం, లవకుశ, నర్తనశాల, ఒకటేమిటి పాడిన పాటలెన్నో పండిత పామర ప్రశంసాపాత్రాలైనాయి. జన్మతః లభ్యమైన సుమధుర గంభీర గాత్రంతో గానం చేసిన "భగవద్గీత అజరామర సుస్వరాన్ని కలిగిన ఘంటసాలను అనునిత్యం స్మరణీయునిగా చేస్తూనే ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల..., 9440595494**

# కొబ్బరి నీళ్లలో ఇన్ని పోషకాలా? ఈ సమస్యలన్నీ పరార్

తియ్యని, స్వచ్ఛమైన కొబ్బరి నీళ్లు వేసవి తాపాన్ని తీర్చుడంలో ముందుంటాయి. ఖనిజ లవణాలు, ఎలక్ట్రోలైట్లు కలిగిన కొబ్బరి నీరు జీర్ణాశయంలో ఏర్పడే సమస్యలకు సహజ చికిత్స చేస్తాయి.ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కి చెందిన వైద్య నిపుణులు ఇటీవల జరిపిన ఒక అధ్యయనంలో ఎనిమిది వారాల పాటు ప్రతి రోజూ కొబ్బరినీళ్లు తాగితే కలిగే ప్రయోజనాలను గురించి వెల్లడించా రు. అల్సరేటివ్ కోలైటిస్ సమస్య ప్రారంభదశలో ఉన్నవారిలో చాలా మెరుగైన మార్పులు కనిపించాయట. కొబ్బరినీళ్లలో యాంటీఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. అందువల్ల ఇది కోలైటిస్ సమస్యలో మంచి ఫలితాలు ఇస్తున్నట్టు భావిస్తున్నారు. అందుకే ఇతర గ్యాస్ట్రోఇంటస్టయిన్ సమస్యలకు కొబ్బరి నీళ్లు చికిత్సగా వాడాలని నిర్ణయించారు.
అయోధ్యలో రామ మందిరంలో విగ్రహ ప్రతిష్టాపనకు ముందు దాదాపుగా 11 రోజుల పాటు ప్రధాని నరేంద్ర మోడి నిరాహార దీక్షలో ఉన్నారు. ఆసమయంలో ఆయన కేవలం కొబ్బరి నీళ్లు మాత్రమే తీసకున్నారట. ఈ విషయం ఆయన వెల్లడి చేసిన తర్వాత కొబ్బరి నీళ్లకు ప్రజాధరణ గణనీయంగా పెరింగిందట.
వేడిగా, తేమగా ఉండే తీరప్రాంతాల్లో కొబ్బరి నీళ్లు ఎక్కువగా ఉపయోగిస్తారు. ఇక్కడ కొబ్బరి సాగు చాలా ఎక్కువగా సాగుతుంది. ఎలక్ట్రోలైట్స్, మినరల్స్, విటమిన్లు ఎక్కువ మొత్తంలో ఉంటాయి. కనుక ఉపవాసంలో ఉన్న వారికి మంచి ఆప్షన్ గా చెప్పుకోవచ్చు. అనారోగ్యం నుంచి కోలుకుంటున్న వారు త్వరగా శక్తి సంతరించుకోవడానికి కూడా దోహదం చేస్తాయి. సహజంగా చల్లగా ఉండే ఈ పానీయం క్యాలరీ కాన్షియస్ డ్రింక్ గా చెప్పుకోవచ్చు. ఇన్ని సుగుణాలున్న కొబ్బరినీళ్ల ఉపయోగాలు మరి కొన్ని తెలుసుకుందాం.



**హైడ్రేటింగ్ డ్రింక్ :** ఉపవాస సమయంలో లేదా వర్కవుట్ల మధ్య విరామాల్లో, ఎండలో తిరగాల్సి వచ్చినపుడు చెమట రూపంలో నష్టపోయిన ఎలక్ట్రోలైట్లను తిరిగి పొందేందుకు కొబ్బరి నీళ్లు గొప్ప ఆప్షన్ గా చెప్పుకోవచ్చు. పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం తో పాటు ఎలక్ట్రోలైట్స్ వంటి పోషకాలతో ఉంటుంది.

**శక్తి పెంచుతుంది :** ఇందులో ఖనిజాలు, ఎలక్ట్రోలైట్లు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో శక్తిస్థాయిని తక్షణమే పెంచడంలో కొబ్బరి నీళ్లు ఉత్తమమైన ఎంపిక.

**చర్మ సంరక్షణ :** చర్మం క్లియర్ గా మెరుస్తూ ఉండేందుకు కొబ్బరి నీళు దోహదం చేతాయి. శరీరంలో టాక్సిన్లను బయటికి పంపి శరీరాన్ని హైడ్రేటెడ్ గా ఉంచుతాయి. కొబ్బరి నీళ్లలో యాంటీఆక్సిడెంట్ గుణాలు ఫ్రీరాడికల్ చర్య నుంచి చర్మాన్ని కాపాడుతాయి. ముఖ్యంగా మలాయి కలిగిన కొబ్బరి నీళ్లు చర్మం పై మెరుపును పెంపొందిస్తాయి.

**యాంటీఇన్ఫ్లమేటరీ :** కొబ్బరి నీళ్లలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు శరీరంలో మైక్రోబయోమ్ ను సమర్థవంతంగా మార్చగలదు. పోటాషియం కలిగి ఉంటుంది కనుక తేలిక పాటి అల్సర్లను, కోలైటిస్ సమస్యకు మంచి చికిత్సగా ఉపయోగపడుతుంది. కొబ్బరి నీరు ఎక్కువైన పొటాషియం, క్లోరైడ్, సిట్రేట్ లను విసర్జించడానికి సహాయపడుతుంది. ఫలితంగా మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడే ప్రమాదం నివారించబడుతుందని అధ్యయనాలు నిరూపిస్తున్నాయి.

**మోతాదు తప్పకూడదు :** కొబ్బరి నీళ్లలో ఎన్నో పోషకాలున్నప్పటికీ, ప్రయోజనాలు ఉన్నప్పటికీ పరిమితంగా మాత్రమే తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా మధుమేహులు సహజ చక్కెరలు కలిగిన ఈ పానీయాన్ని మితంగా తీసుకోవాలి. చాలా రకాల ఇతర పానీయాలతో పోలిస్తే ఆరోగ్యానికి మేలు చేసేవే అయినప్పటికి రక్తంలో చక్కెర స్థాయిని పెంచే ప్రమాదం ఉంటుందని గుర్తుంచుకోవాలని చెబుతున్నారు.



# సింధు నదిలో పసిడి పంట

## పట్టుకు పోతున్న పాకిస్తానీయులు

**భారతదేశం నుంచి ప్రవహించే సింధు నదిలో పసిడి పంట పండుతోంది. పొరుగు దేశమైన పాకిస్తాన్ ప్రజలకు జీవనాధారమైంది. భారత్-పాక్ దేశాల మధ్య సంబంధాలు పలు సందర్భాల్లో ఉద్రిక్తతలకు దారితీసినా... పాక్ ప్రజలు ఆకలితో పడే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని భారత్ ఆ వైపుగా దృష్టి సారించలేదన్న వాదనలూ మరింత బలంగా వినిపిస్తున్నాయి. వాస్తవానికి నదీ ప్రవాహంలో బంగారం ఎలా లభ్యమవుతుందో అనేది ఒక ప్రశ్నార్థకం. మరి భారతదేశం నుండి ప్రవహించే సింధూనదిలో ఈ పసిడి పంట ఎలా దొరుకుతుంది... పాకిస్తానీయులు ఎలా దాన్ని ఒడిసి పట్టుకొని జీవనోపాధిని సాగిస్తున్నారో పరిశీలిద్దాం.**

పాకిస్తాన్‌లో ఖైబర్ ఫక్తుంక్వా ప్రావిన్స్ లోని నౌషెహ్రా జిల్లా నిజాంపూర్ కు చెందిన సయీద్ మహ్మద్, ఆయన స్నేహితుడు వకాస్ సింధు నదిలో పసిడి పంటను తమ సొంత చేసుకోవడానికి ఎంతో పాటుపట్టారు. సూర్యోదయం అవుతుండడంతో తామొచ్చిన పనిని ముగించుకుని ఇంటికి వెళ్లడానికి సిద్ధమైయ్యారు. ఒకవైపు ఎముకలు కొరికే చలిలో, ఎక్కడికక్కడ చిరిగిన పాత కోటు, మాసిపోయిన దుస్తులతో, కాళ్లకు అరిగిపోయిన ప్లాస్టిక్ చెప్పులతో రాత్రంతా సింధు నదిలో ఇసుకను జల్లెడ పట్టి అందులో బంగారం కోసం వెతకడమే వీరిద్దరి పని. సయీద్ మహ్మద్‌కు రోజుకు రూ. 1,500 కూలి ఇస్తారు. వారు చేస్తున్నపని పూర్తిగా చట్టవిరుద్ధం కాబట్టి ఏదైనా ప్రమాదం జరిగినా అందుకు ఎవరూ బాధ్యత వహించరు.

నౌ షెహ్రాలోని జహంగీరా ప్రాంతంలో సుమారు మూడు లక్షల మంది నివసిస్తుంటారు. వీకిలో చాలా మంది స్థానికంగా ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీలలో, రవాణా రంగంలో పనిచేస్తూ, భద్రత సంస్థలలో ఉద్యోగాలు చేస్తూ ఇక్కడి వారు ఉపాధి పొందుతుంటారు. గత రెండేళ్లలో సింధు నదిలో బంగారం వెలికితీసే పనుల్లోనూ స్థానికులు పెద్దయెత్తున పాల్గొంటున్నారని స్థానికులు, అక్కడి అధికారులు కూడా చెప్తున్నారు. ఈ బంగారం వేట పనిలో, దీనికి సంబంధించిన వ్యాపారాలలో ఉన్నవారితో ఎవరు మాట్లాడినా వారిని అనుమానించడం అక్కడి ప్రజలకు అలవాటు. ఇక్కడ జరిగేదంతా అక్రమంగా జరుగుతున్నదే కావడంతో దిక్కూ మొక్కు లేకుండా పడి ఉండాల్సిందే. ఎవరికి ఏ విషయం అడిగినా వారు అందుకు తిరగి ఎటువంటి సమాధానం ఇవ్వరు సరికదా.. మీరు మాట్లాడేందుకు ప్రయత్నిస్తే వారి నుండి సమాధానం కాదు.. తిరుగుబాటే ఎదురయ్యే అవకాశాలు కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇక్కడి ఈ వ్యవహారం అంతా కొంతమంది పెద్దల కనుసన్నల్లోనే జరుగుతోందనే ఆరోపణలు ఎంతో బలంగా వినిపిస్తున్నాయి.

**బంగారం వెలికితీత: ఖర్చెంత...? ఆదాయం ఎంత...?**

స్థానికంగా బంగారం వేటలో నిమగ్నమైన ఓ వ్యక్తి గత ఆరు నెలలుగా భారీ యంత్రాలతో సింధూ నది నుంచి బంగారం వెలికితీసే ప్రయత్నాలు చేస్తున్నారు. మహ్మద్ ఇగ్బాల్ (పేరు మార్పు) గత నిజాంపూర్‌కు చెందిన ఒక స్నేహితుడు ఇగ్బాల్‌కు బంగారం వెలికితీసేందుకు ఒక సలహా ఇచ్చాడని, ఇక్కడ కొంత డబ్బుతో పని మొదలుపెడితే రోజుకు లక్షల్లో సంపాదించవచ్చని చెప్పాడని ఇగ్బాల్ చెప్పుకొచ్చారు. ఆయన సలహా ప్రకారమే ఇక్కడ తాను పని ప్రారంభించానని, కానీ ప్రతీరోజూ చాలా సమస్యలు వస్తున్నాయని వాపోయాడు. నెలకు రూ.4 లక్షల చొప్పున చెల్లించేలా మూడు చిన్న ఎక్స్‌కవేటర్లను అద్దెకు తీసుకున్నానని, 20 మంది కూలీలను కూడా నియమించుకున్నానని ఇగ్బాల్ చెప్పారు. నది ఒడ్డున ఉన్న ఇసుకలో బంగారం వెతుకుతున్నా అద్దె, కూలీల ఖర్చు భారీగా ఉండటంతో వారానికి రూ. 15 నుంచి 20 లక్షల నష్టం వస్తోందని ఆయన చెప్పారు. చిన్న యంత్రాలతో పని సాగకపోవడంతో పంజాబ్ (పాకిస్తాన్‌లోని) నుంచి మూడు పెద్ద ఎక్స్‌కవేటర్లను ఒక్కొక్కటి రూ. 18 లక్షల అద్దెకు తీసుకొచ్చినట్లు వెల్లడించారు. ఇవి నదిలో నీట్లో ఉన్న ఇసుకను కూడా తవ్వుతాయన్నారు. వీటిని తీసుకొచ్చాక ఆదాయం పెరిగిందన్నారే కానీ ఎంత ఆదాయం వస్తుందో మాత్రం బయటపెట్టలేదు.

అలాగే గతంలో నిర్మాణ రంగంలో పనిచేసిన సయీద్ (పేరు మార్పు)కు ఆయనకు బంగారం అన్వేషణలో కాస్తంత అనుభవం ఉంది. ఆయన రూ. 4 కోట్ల విలువైన భారీ యంత్రాలను కొని వాటిని స్థానిక కాంట్రాక్టర్‌కు ఇచ్చారు. బంగారం వెలికితీసే పనులు చేయాలని, ఆదాయంలో సగం తనకు ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నారు. మొదటి రెండు నెలలలో వారికి ఏమీ సంపాదన రాలేదు. పైగా, అక్రమంగా తవ్వకాలు జరుపుతుండడంతో పోలీసులు దాడి చేసి రూ.1.5 కోట్ల విలువైన యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో అయిదుగురు కూలీలను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ తరువాత వారిని బెయిలుపై విడుదల చేసినా యంత్రాలు మాత్రం పోలీసుల స్వాధీనంలోనే ఉండిపోయాయి. ఈ పసిడి వేటలో చెప్పలేనన్ని ఎన్నో సమస్యలు ఉంటాయని, పోలీసులు నిత్యం దాడులు చేస్తుంటారని, నదిలో యంత్రాలు మునిగిపోతుంటాయని సయీద్ వాపోయారు. అయినా, భారీగా పెట్టుబడి పెట్టడం వల్ల ఈ పనిని వదులుకోలేకపోతున్నట్లు చెప్పారాయన.



**(మిగతా 8వ పేజీలో)**



## సింధు, కాబుల్ నదుల్లో చాలా కాలంగా పసిడి వేట

నౌషెహ్రా జిల్లాలో సింధు నది నుంచి అక్రమంగా చేపడుతున్న బంగారం తవ్వకాలను అడ్డుకునేందుకు స్థానిక జిల్లా అధికారులు, ఖనిజ శాఖ అధికారులు కలిసి చర్యలు చేపడుతున్నారు. కాబుల్ నదిలో, నౌషెహ్రా వరకు సింధు నదిలో బంగారం వేట సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్నదే అయినప్పటికీ 2022 నుంచి యంత్రాల సహాయం మరింత ఎక్కువైందని నిజాంపూర్ డిప్యూటీ కమిషనర్ ఖలీద్ ఖట్టక్ వెల్లడించారు. బంగారం అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకు నిజాంపూర్ సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలో పోలీస్, ఖనిజ శాఖల ఆధ్వర్యంలో ఉమ్మడి చెక్ పోస్ట్ ఏర్పాటు చేశారు. చట్ట విరుద్ధంగా బంగారం తవ్వకాలకు పాల్పడుతున్నవారిపై ఇప్పటివరకు 858 కేసులు నమోదు కాగా, వాటిలో 825 మందిని అరెస్ట్ చేశారు. అరెస్టు అయిన వారి నుండి 70 లక్షల పాకిస్తానీ రూపాయల జరిమానా విధించి, వసూలు చేశారు. 12 ఎక్స్‌కవేటర్లు, 7 వాహనాలు, 20 ద్విచక్ర వాహనాలు, ఇతర యంత్ర పరికరాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం ఎంతగా కట్టడి చేస్తున్నా ఈ అక్రమ కార్యకలాపాలు రోజురోజుకూ పెరుగుతున్నాయే కానీ తగ్గడం లేదని స్థానికులు వాపోతున్నారు. అక్రమ పసిడి తవ్వకాలను అరికట్టేందుకు ప్రభుత్వమే బంగారం వెలికితేసే పనులు చేపడితే ఎంతో మేలని, నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు మరింత అవకాశాలు మెరుగవుతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. నౌషెహ్రా, స్వాబీ జిల్లాలలో సింధు నదిలో ఖనిజశాఖ అధికారులకు తెలిసే అక్రమంగా బంగారం తవ్వకాలకు ఆరోపణలు వస్తున్నాయి. సింధు నదిలో బంగారం నిల్వలు ఏ స్థాయిలో ఉన్నాయన్న లెక్కలూ అధికారుల వద్ద ఉన్నాయని పేరు చెప్పడానికి ఇష్టపడని అధికారి ఒకరు చెప్పడం గమనార్హం. ఈ అక్రమ కార్యకలాపాలను నిరోధించడానికి పెద్దయెత్తున పోలీసులను మోహరిస్తున్నారు. అక్రమ తవ్వకాలను అడ్డుకునే సమయంలో ఒక్కోసారి కాల్పులు, రాళ్లు రువ్విన ఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. పోలీసులు తనిఖీలకు వచ్చిన సమయంలో కొందరు అక్రమ తవ్వకందారులు పడవల్లో నది దాటి పంజాబ్ ప్రావిన్స్‌కు పారిపోతున్నారు. దీంతో అక్కడ తవ్వకాలకు ఉపయోగించే భారీ యంత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకొని, వాటిని పోలీస్‌స్టేషన్లకు తరలించడం ఎంతో కష్టమవుతోంది. దీంతో వాటిని అక్కడే ఉంచేస్తున్నారు. నిజాంపూర్ వద్ద సింధు నదిలో తవ్వకాలతో పాటు జహంగీరా, స్వాబీ జిల్లాలోని కుందర్ పార్క్ ప్రాంతాలు, పాకిస్తాన్ పంజాబ్‌లోని అటాక్‌లో కూడా సింధు నదిలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని ఆయా ప్రాంతాలకు చెందిన స్థానికులు చెబుతున్నారు.

### నదీ తీరంలో అటవీ భూములు

కాబూల్ నది నుంచి ఇసుక, కంకర, బంగారం అక్రమ తవ్వకాలను అరికట్టడంతో పాటు ఈ ప్రాంతంలోని ఇతర సమస్యల పరిష్కారానికి కొంత కాలం క్రితం జహంగీరాలో స్థానిక పెద్దలతో ఒక కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ చీఫ్ రిఫత్ ఉల్లా మాట్లాడుతూ– నదీ తీరంలో స్థానికులకు వందల ఎకరాల అటవీ భూములున్నాయని, భూగర్భ, ఖనిజశాఖ అధికారుల నుండి ఎవరికైనా తవ్వకాలకు అనుమతులుంటే వారు తమ భూముల్లోని ఇసుకను తవ్వుకోవచ్చని చెప్పారు. ఆ భూములలో తవ్వకాలకు ఎవరైనా లీజులు తీసుకుంటే అందుకు వారు చట్టప్రకారం ప్రభుత్వానికి పన్ను చెల్లిస్తారని, అంతేకానీ అక్రమంగా నదిలో తవ్వకాలకు వీలు లేదని అన్నారు. నదిలో తవ్వకాలు జరుపుతున్నవారితో స్థానిక పెద్దల కమిటీ రహస్య ఒప్పందాలు చేసుకున్నారనే ఆరోపణలను కమిటీ చీఫ్ రిఫత్ ఉల్లా తోసిపుచ్చారు. అయితే ఇక్కడో చిక్కు కూడా ఉంది. సింధు నదిలో అక్రమ తవ్వకాలలో లభించిన పసిడి వ్యాపారం చేస్తున్న వారికి సంబంధించిన డేటా భారత్, పాక్ దేశాలకు చెందిన అధికారుల వద్ద లేకపోవడం దురదృష్టకరం.



## సింధు నదిలో బంగారం ఎలా వస్తోంది...?

సింధు నదిలో బంగారం లభ్యతపై గతంలో ఎన్నో పరిశోధనలు జరిగాయి. పెషావర్ విశ్వవిద్యాలయంలోని జియాలజీ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అస్గర్ అలీ పర్యవేక్షణలో గ్రాడ్యుయేట్ విద్యార్థులు 2016లో స్వాత్, కాబుల్ నదుల్లో బంగారంపై అధ్యయనం చేశారు. సింధు నది, కాబుల్ నది సంగమ ప్రాంతంలో జియోఫిజికల్ సర్వే నిర్వహించామని, నది ఒడ్డున మూడు మీటర్ల లోతులో బంగారం ఉన్నట్లు గుర్తించామని అస్గర్ అలీ తన నివేదికలో స్పష్టం చేశారు. అప్పటికి లభ్యమవుతున్న బంగారాన్ని వివిధ స్థాయుల్లో పరిశీలించి, నదికి మరింత లోతుకు వెళ్తున్నకొద్దీ బంగారం నిల్వలు ఎక్కువ ఉన్నట్లుగా వీరు తేల్చి చెప్పారు.



మూడు రకాల శిలల్లో ఒకటి అగ్ని శిల(ఇగ్నస్ రాక్). నది ఎగువన పర్వత ప్రాంతాల్లోని ఈ రకం రాయి హిమనీనదులు, భారీ వర్షాలు, వరదలు, భూమి కోత వంటి సహజ కారణాల వల్ల క్రమక్షయానికి గురై అందులో ధాతువులు ప్రవాహంలో కొట్టుకొస్తాయి. బంగారం వంటి ధాతువులు భార లోహాలు. అవి ప్రవాహంలో వచ్చి నీటి అడుగుకు చేరుతాయి. నీటి దిశ మారే చోట అంటే డ్యామ్‌లు వంటి అడ్డుకట్టలు ఉన్నచోట, నదుల సంగమం వద్ద ఇవి పేరుకుపోయే అవకాశం ఉంటుందని అస్గర్ అలీ చెప్పారు. అటాక్ ప్రాంతంలో కాబుల్, సింధు నదులు కలుస్తాయని, అలాగే నిజాంపూర్ దగ్గర సింధు నది మలుపు ఉండడం వల్ల అక్కడ బంగారం చేరొచ్చని ఆయన అంచనా వేశారు. బంగారమే కాకుండా ఇతర విలువైన భార లోహాలు అక్కడ నీటిలో ఉంటాయన్నారు. నిర్మాణ పనుల కోసం కాబుల్, సింధు నదుల నుంచి తీసుకెళ్లే ఇసుక, కంకరలో బంగారం సహా వివిధ లోహ కణాలు ఉంటున్నా వాటిని ఇసుక నుంచి వేరు చేసేందుకు సరైన పద్ధతులు అందుబాటులో లేకపోవడంతో బంగారం వృథా అవుతుందని అస్గర్ అలీ వివరించారు.

### సింధు నదిలో దొరికే బంగారం నాణ్యత ఎలా ఉంది..?

ప్రొఫెసర్ డాక్టర్ అస్గర్ అలీ మాట్లాడుతూ చేపట్టిన అధ్యయనంలోని అంశాలను ఇలా చెప్పుకొచ్చారు. నీటి నుంచి బంగారు రేణువులను వేరు చేయడానికి నది ఒడ్డున పెద్ద బలమైన ఇనుప జల్లెడలను ఏర్పాటు చేసి, యంత్రాల సాయంతో నదిలోని ఇసుక, మట్టిని అందులో పోసి జల్లెడ పతున్నారని అస్గర్ వెల్లడించారు. అలా చేసినప్పుడు పెద్ద రాళ్లన్నీ జల్లెడలో ఉండిపోయి చిన్నచిన్న రేణువులు దిగువన పరిచే పరదాలపై చేరుతాయని, అప్పుడు ఆ పరదాలను పెద్ద ఇనుప పాత్రలలో నీటిని నింపి అందులో వేస్తారన్నారు. నీరు నింపిన పాత్రలో వేసిన పరదాల నుంచి సూక్ష్మ ఇసుక రేణువులు వేరైన తరువాత దాన్ని సేకరించి పాదరసం కలుపుతారని, ఆ ప్రక్రియ తరువాత పాదరసానికి అతుక్కున్న బంగారు రేణువులను అగ్నిలో కరిగించడం ద్వారా బంగారం తీస్తారని వివరించారు. దక్షిణాఫ్రికాలోని జోహాన్నెస్‌బర్గ్, అమెరికాలోని కాలిఫోర్నియా ప్రాంతాలలో ఇలా నది నీటి నుంచి బంగారం తీస్తుంటారని పేర్కొన్నారు. ఖైబర్ పక్తుంఖ్వా ప్రాంత నదుల్లో పెద్ద మొత్తంలో బంగారం ఉందని, దీనిపై మరిన్ని పరిశోధనలు, వెలికితీతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అవసరమని భారత్, పాకిస్తాన్ దేశాలకు సూచించారు. ఇక్కడ అక్రమంగా సేకరిస్తున్న బంగారం స్థానిక మార్కెట్లలోకి తరలి వస్తోందని, ఈ బంగారం నాణ్యత ఎంతో బాగుందని అస్గర్ వివరించారు. అక్రమ మైనింగ్‌ను అరికట్టి ప్రభుత్వమే వెలికితీత చేపడితే ఖజానాకు ఆదాయం రావడంతోపాటు స్థానికులకు చట్టబద్ధంగానే ఉపాధి అవకాశాలు దొరుకుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

**– వి.వి.వెంకటేశ్వరరావు,**
**6300866637.**

# సినిమా రివ్యూ

'గుడ్ నైట్' చిత్రాన్ని ఓటీటీలో చూసిన తెలుగు ప్రేక్షకులు ఎక్కువే. అందులో మణికందన్ నటన చాలా మందికి నచ్చింది. ఆయన నటించిన తాజా సినిమా 'లవర్'. ఇందులో 'రైటర్ పద్మభూషణ్', 'మ్యాడ్' ఫేమ్ శ్రీ గౌరీ ప్రియా హీరోయిన్. ప్రభురామ్ వ్యాస్ దర్శకత్వంలో నజేరత్ పసీలియన్, మగేష్ రాజ్ పసీలియన్, యువరాజ్ గణేషన్ నిర్మించారు. ఈ చిత్రాన్ని 'ట్రూ లవర్' పేరుతో తెలుగులో మారుతి, ఎస్కేఎన్ విడుదల చేశారు. ఈ సినిమా ఎలా ఉందో రివ్యూలో చూడండి.

కథ:

అరుణ్ (మణికందన్), దివ్య (శ్రీ గౌరీ ప్రియా)ది ఆరేళ్ల ప్రేమ. ఇద్దరూ కాలేజీలో చదివినప్పటి నుండి ప్రేమించుకుంటున్నారు. దివ్యకు మంచి ఉద్యోగం వచ్చింది. కేఫ్ పెట్టాలని ఖాళీగా ఉన్నాడు అరుణ్. తాగుడు, అనుమానం ఎక్కువ. మరొకరికి దివ్య దగ్గర అవుతుందోనని ఆమె ఎక్కడికి వెళ్లేది, ఏం చేసేదీ చెప్పమని అడుగుతూ ఉంటాడు. ఒక విధంగా ఆమెను కంట్రోల్ చేయాలని చూస్తాడు.

అరుణ్ ప్రవర్తనతో విసిగిపోయిన దివ్య చాలాసార్లు బ్రేకప్ చెబుతుంది. అతడు సారీ చెప్పేసరికి మళ్లీ కలుస్తుంది. ఒక దశలో అరుణ్ నుంచి దూరం కావాలని నిర్ణయించుకుంటుంది. ఆఫీసులోని సహచరులతో కలిసి ట్రిప్ వెళ్లడానికి రెడీ అవుతుంది. అనుకోకుండా దివ్యకు బర్త్ డే విషెస్ చెప్పడానికి వస్తాడు అరుణ్. అతడిని ఇన్వైట్ చేస్తారు. నో అని ముందు చెప్పినా... చివరకు దివ్య, ఆమె స్నేహితులతో అరుణ్ కూడా వెళతాడు. తర్వాత ఏమైంది? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.

విశ్లేషణ:



ప్రేమకు నమ్మకం పునాది అయితే... అనుమానం సమాధి. నమ్మకం లేని చోట ప్రేమకు చోటు లేదనే కథాంశంతో తెలుగు, తమిళ భాషల్లో కొన్ని సినిమాలు వచ్చాయి. ఆ సినిమాలకు, 'ట్రూ లవర్'కు డిఫరెన్స్ ఏంటంటే? ఈతరం యువతీ యువకుల నేపథ్యం! అది కొత్తగా కనిపిస్తుంది. బాటిల్ కొత్తది అయితే సరిపోదు కదా! లోపల సరుకులో కూడా విషయం ఉండాలి. మరి, అనుమానం – అభద్రత నేపథ్యంలో ప్రభురామ్ వ్యాస్ తీసిన సినిమా ఎలా ఉందంటే?

'ట్రూ లవర్'లో కథ కంటే క్యారెక్టర్లు, మూమెంట్స్, సన్నివేశాలతో యూత్ రిలేట్ అవుతారు. బాయ్‌ఫ్రెండ్‌కు చెప్పకుండా ఆఫీస్ కొలీగ్స్‌తో అమ్మాయి బయటకు వెళుతుంది. అది తెలిసిన అబ్బాయి లొకేషన్ షేర్ చేయమని అడుగుతాడు. ఈ తరహా సన్నివేశాలు కొన్ని ఉన్నాయి. కథ, కథనంతో సంబంధం లేకుండా వాటికి విజిల్స్ పడతాయి. 'ట్రూ లవర్' ప్రారంభంలో కొత్తగా, ఆసక్తిగా ముందుకు వెళ్లినా... కొంతసేపటి తర్వాత రిపీటెడ్ సన్నివేశాలతో విసిగిస్తుంది.

ప్రభురామ్ వ్యాస్ రచనలో బలంలో ఉంది. ముఖ్యంగా హీరో, తల్లి క్యారెక్టరైజేషన్లతో పాటు కొన్ని సన్నివేశాలను రాసిన తీరు బావుంది. అందమైన లవర్ ఉన్నప్పుడు, తనకు ఉద్యోగం లేనప్పుడు అబ్బాయి అభద్రతకు లోను కావడాన్ని అద్భుతంగా చూపించారు. భర్తతో సమస్యలు ఉన్నప్పటికీ, కొడుకు బాధ్యతగా లేనప్పటికీ... ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటే సెటిల్ అవుతాడని తల్లి పాత్ర సైతం నచ్చుతుంది. అయితే... అమ్మాయి ప్రేమలో ఎందుకు పడింది? అనే ప్రశ్నకు సరైన సమాధానం లభించదు. అబ్బాయితో సమస్య ఉన్నప్పటికీ... ఎందుకు రిలేషన్ కంటిన్యూ అవుతుంది? అనేది అర్థం కాదు. రిపీటెడ్ సీన్లు వల్ల బోరింగ్ మూమెంట్స్ ఎక్కువ అయ్యాయి. ఎమోషనల్ సీన్లలో తమిళ ఫ్లేవర్ అందరినీ ఆకట్టుకోవడం కష్టం.

హీరో హీరోయిన్ల మధ్య ప్రేమలో సమస్య ఉందని సినిమా ప్రారంభంలో దర్శకుడు స్పష్టంగా చెప్పారు. టాక్సిక్ రిలేషన్ నుంచి అమ్మాయి బయట పడటానికి క్లైమాక్స్ వరకు వెయిట్ చేయాల్సి వచ్చింది. అయితే... క్లైమాక్స్‌లో హీరో యాటిట్యూడ్ కొంత మంది అబ్బాయిలను మెప్పిస్తుంది. 'ట్రూ లవర్'లో మాటలు, పాటలు, నేపథ్య సంగీతం బావున్నాయి. సాన్ రోనాల్డ్ మ్యూజిక్ ట్రెండీగా, పెప్పీగా సాగింది. కెమెరా వర్క్ కూడా బావుంది. ప్రొడక్షన్ వేల్యూస్ బావున్నాయి. అరుణ్ పాత్రకు మణికందన్ ప్రాణం పోశాడు. అతని నటన మెప్పిస్తుంది. తాగిన తర్వాత అమ్మాయితో మాట్లాడే సన్నివేశాల్లో కోపాన్ని ప్రదర్శించడం, మత్తు దిగిన తర్వాత సారీ చెప్పడం వంటి మూమెంట్స్ చాలా మందికి కనెక్ట్ కావచ్చు. 'రైటర్ పద్మభూషణ్', 'మ్యాడ్' సినిమాలతో కంపేర్ చూస్తే... ఇందులో శ్రీ గౌరీ ప్రియాకు ఎమోషనల్ సన్నివేశాలు చేసే అవకాశం లభించింది. ఆమె కూడా బాగా చేశారు. మిగతా నటీనటులు ఓకే. 'ట్రూ లవర్'లో యువతీ యువకులు రిలేట్ అయ్యే మూమెంట్స్ ఉన్నాయి. సీన్లతో కనెక్ట్ కావచ్చు. కానీ, కథతో కనెక్ట్ కావడం కష్టం. కాంటెంపరరీగా తీశారు కానీ కథను కన్విన్సింగ్‌గా చెప్పలేదు. హీరో హీరోయిన్లు బాగా చేశారు. మ్యూజిక్ బావుంది. ప్రచార చిత్రాలు, పాటలు చూసి ఎక్కువ అంచనాలు పెట్టుకోవద్దు. యువతను మెప్పించే, వాళ్లతో విజిల్స్ వేయించే సన్నివేశాలకు 'ట్రూ లవర్'లో లోటు లేదు.

సూపర్ స్టార్ రజనీకాంత్ గతేడాది 'జైలర్'తో బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్నారు. ఎన్నో ఫ్లాపులు, డిజాస్టర్ల తర్వాత రజనీ మార్కెట్‌ను మళ్లీ తీసుకువచ్చిన సినిమా అది. 'జైలర్' తర్వాత రజనీకాంత్ కూతురు ఐశ్వర్య దర్శకత్వంలో నటించిన సినిమా 'లాల్ సలామ్'. విష్ణు విశాల్, విక్రాంత్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాలో రజనీకాంత్ ఎక్స్‌టెండెడ్ కామియోలో నటించారని చిత్ర బృందం ప్రచారంలో పేర్కొంది. మరి ఇంతకీ సినిమా ఎలా ఉంది?

కథ:

1993లో జరిగే కథ ఇది. కసుమూరు అనే ప్రాంతంలో హిందువులు, ముస్లింలు ఐకమత్యంగా కలిసి ఉండేవారు. కానీ మొయిద్దీన్ (రజనీ కాంత్) కొడుకు శంషుద్దీన్‌ను (విక్రాంత్)ను గురు (విష్ణు విశాల్) కొట్టడంతో రెండు మతాల వారి మధ్య గొడవలు వస్తాయి. ఒకప్పుడు గురు (విష్ణు విశాల్) తండ్రి (ఫిలిప్ లివింగ్‌స్టోన్ జోన్స్), మొయిద్దీన్ భాయ్ (రజనీకాంత్) ప్రాణ స్నేహితులు. గురు ఇంటిని కూడా తగలబెట్టేస్తారు. ఆ తర్వాత ఏం జరిగింది? గురు, శంషుద్దీన్‌ల మధ్య గొడవకు అసలు కారణం ఏంటి? అన్నది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

విశ్లేషణ:

'లాల్ సలామ్' ముందు నుంచి ప్రచారం జరిగినట్లు బోల్డ్ సబ్జెక్ట్ ఏమీ కాదు. కలిసి మెలిసి ఉంటున్న రెండు మతాల వారి మధ్య కొందరు రాజకీయ నాయకులు తమ వ్యక్తిగత స్వార్థం కోసం చిచ్చు పెడతారు. కానీ చివర్లో తిరిగి రెండు మతాల వారూ కలిసిపోతారు. క్లుప్తంగా ఇదే కథ. రజనీకాంత్ పోషించిన మొయిద్దీన్ పాత్ర వివాదాస్పదంగా ఉంటుందని ప్రచారంలో పేర్కొన్నారు. కానీ సినిమాలో అది ఒక పవర్‌ఫుల్ పాత్ర మాత్రమే. చివర్లో హిందువుల దేవత విగ్రహాన్ని ఎత్తడం తప్ప ఎక్కడా అవుట్ ఆఫ్ ది బాక్స్, బోల్డ్‌గా ఆ పాత్ర కనిపించదు. డైలాగ్స్ కూడా అంత పదునుగా లేవు.

సినిమా చాలా ఆసక్తికరంగా ప్రారంభం అవుతుంది. ఒక ఊరి ఓట్ల కోసం రాజకీయ నాయకుల ఎత్తులు, ఊరి ప్రజల నుంచి విష్ణు విశాల్ తప్పించుకోవడానికి ప్రయత్నించడం వంటివి చూశాక అసలు ఏం జరిగి ఉంటుందని ఆసక్తి పెరుగుతుంది. కానీ ఆ ఆసక్తి



చచ్చిపోవడానికి ఎంతో సేపు పట్టదు. ఎందుకంటే అక్కడి నుంచి కథ ఏమాత్రం ముందుకు సాగదు. ప్రథమార్థంలో వచ్చే హీరోయిన్ లవ్ ట్రాక్, సాంగ్‌కు కథకు ఏమాత్రం సంబంధం ఉండదు. అలా అని దాన్ని బాగా తెరకెక్కించారా? అంటే అది కూడా లేదు. జాతర కోసం వేరే ఊరి నుంచి అరువు తెచ్చుకున్న రథాన్ని (తేరు) జాతర మధ్యలోనే తీసుకువెళ్లిపోవడంతో ఇంటర్వల్ కార్డు పడుతుంది.

సెకండాఫ్ ఎక్కువగా రథం చుట్టూనే తిరుగుతుంది. విష్ణు విశాల్ తను ప్రయోజకుడ్ని అని నిరూపించుకోవాలంటే ఊరికి రథం తేవాల్సిందేనని ఫిక్స్ అవుతాడు. రథం తీసుకురావడం అంతకు ముందు అతని కారణంగా ఊరికి జరిగిన నష్టాన్ని ఎలా మర్చిపోతారో అర్థం కాదు. అన్నిటికంటే దారుణం అనిపించే విషయం ఏంటంటే గొడవ తర్వాత విష్ణు విశాల్ ఊరిలోకి వచ్చేటప్పుడు జీవిత (విష్ణు విశాల్ తల్లి పాత్రధారి) బయటకు వచ్చి 'నువ్వు చచ్చిపోతే నేను సంతోషిస్తాన్రా' అని హెవీ ఎమోషనల్ డైలాగులు చెప్తారు. కానీ కొన్నాళ్లకే విష్ణు విశాల్ డబ్బులు సంపాదించి రథం రెడీ చేస్తున్నప్పుడు సంతోషించినట్లు చూపిస్తారు. తల్లి ప్రేమను, డబ్బుతో ముడి పెట్టడం ఏంటో తీసినోళ్లకే తెలియాలి. క్లైమ్యాక్స్‌లో ఏం జరుగుతుందో కూడా ముందే ఊహించడం పెద్ద కష్టం కాదు. కొన్ని డైలాగ్స్ బాగా రాసుకున్నారు. 'బిడ్డ సంపాదిస్తే ఇంటికి గౌరవం. బిడ్డ సాధిస్తే దేశానికే గౌరవం' లాంటి సంభాషణలు ఆకట్టుకుంటాయి.

మొదటిగా 'లాల్ సలామ్'లో రజనీకాంత్‌ది ఎక్స్‌టెండెడ్ క్యామియో అని ప్రచారం చేశారు. కానీ ఈ నిడివి కాస్త తక్కువ ఉన్న ప్రధాన పాత్ర అని చెప్పవచ్చు. సినిమా చూశాక విక్రాంత్ కంటే రజనీకాంత్‌కే ఎక్కువ స్క్రీన్ టైమ్ ఉంది కదా అని కూడా అనిపిస్తుంది. రెండున్నర గంటల సినిమాలో గంట వరకు స్క్రీన్ టైమ్ ఉంది. నిజానికి ఈ సినిమాలో అసలైన క్యామియో హీరోయిన్ అనంతిక శానిల్‌కుమార్‌ది. ప్రథమార్ధంలో ఇంట్రడక్షన్ సీన్, ఒక పాట, జాతరలో కొన్ని షాట్లు, ఆ తర్వాత ఒక సీన్, కట్ చేస్తే మళ్లీ క్లైమ్యాక్స్‌లో మళ్లీ చిన్న సీన్ అంతే. ప్రాధాన్యత లేనప్పుడు పాత్రనే రాసుకోకుండా ఉంటే బాగుండేది. కొత్తగా ప్రయత్నిస్తున్నాం అని తీసేవాళ్లకే కాకుండా చూసేవాళ్లకి కూడా అనిపించాలంటే ఇలాంటివి అవాయిడ్ చేయాల్సిందే. కపిల్ దేవ్ క్యామియోకు కూడా పెద్దగా ప్రాధాన్యత లేదు. ఆయన స్థానంలో ఏ క్యారెక్టర్ ఆర్టిస్టును తీసుకున్నా ఇంపాక్ట్‌లో పెద్దగా తేడా ఉండేది కాదు. ఏఆర్ రెహమాన్ సంగీతం సినిమాకు అతి పెద్ద మైనస్. కనీసం ఒక్క పాట కూడా ఆకట్టుకోదు. ఇక నేపథ్య సంగీతం గురించి అయితే ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. ఒక్క సన్నివేశాన్ని కూడా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఎలివేట్ చేయలేకపోయింది. సినిమాటోగ్రఫీ ఆకట్టుకుంది. చాలా వరకు రియల్ లొకేషన్లలోనే ఈ సినిమాను తెరకెక్కించారు. రజనీ లాంటి స్టార్‌ను పెట్టుకుని కూడా ఈ ప్రయత్నం చేశారంటే మాత్రం అభినందించదగ్గ విషయమే.

నటీనటుల ఎంపికలో మాత్రం ఐశ్వర్య రజనీకాంత్‌కు 100కు 100 మార్కులు ఇవ్వవచ్చు. ఒకప్పుడు రజనీకాంత్‌తో సూపర్ హిట్ సినిమాల్లో నటించి తర్వాత తెర మరుగైపోయిన ఫిలిప్ లివింగ్‌స్టోన్ జోన్స్, సెంథిల్ వంటి నటులను మళ్లీ చూడటం కాస్త నోస్టాల్జిక్‌గా ఉంటుంది. సెంథిల్‌కు నటించడానికి స్కోప్ ఉన్న పాత్ర కూడా దొరికింది. స్వతహాగా మంచి నటుడు అయిన సెంథిల్ ఈ పాత్రలో బాగా నటించారు. కానీ సినిమాలో బెస్ట్ పెర్ఫార్మెన్స్ అంటే మాత్రం విష్ణు విశాల్ తల్లి పాత్రలో నటించిన జీవితా రాజశేఖర్‌దే. ఎమోషనల్ సన్నివేశాల్లో చాలా బాగా నటించారు. ఇప్పటి తరం వారికి జీవితను ఇలా చూడటం కొత్తగా ఉంటుంది. రజనీకాంత్‌కు ఇలాంటి పాత్రలు పోషించడం కొత్తేమీ కాదు. విష్ణు విశాల్, విక్రాంత్ తమ పాత్రల పరిధి మేర ఆకట్టుకుంటారు.

ఓవరాల్‌గా చెప్పాలంటే... రజనీకాంత్ హార్డ్ కోర్ ఫ్యాన్స్‌కు కూడా 'లాల్ సలామ్'ను చూడటం కష్టమే.

# సినిమా రివ్యూ

మాస్ మహారాజా రవితేజ హీరోగా నటించిన ఏ సినిమాలోనైనా.. తనదైన మార్క్ కామెడీ, యాక్షన్ సీన్లతో ప్రేక్షకులకు కావలసినంత వినోదాన్ని పంచుతాడు. కానీ.. ధమాకా తర్వాత రవితేజ ఖాతాలో ఒక్క హిట్ కూడా పడలేదు. గతేడాది బ్యాక్ టు బ్యాక్ సినిమాలు విడుదలైనా.. అన్నీ డిజాస్టర్లుగానే నిలిచాయి. వాల్తేరు వీరయ్యలో నటించినా.. అది చిరంజీవి తమ్ముడి పాత్రలో కొద్దిసేపు మాత్రమే ఉంటాడు. రావణాసుర, రామారావు ఆన్ డ్యూటీ ఫట్ అయ్యాయి. పాన్ ఇండియా సినిమాగా విడుదలైన టైగర్ నాగేశ్వరరావుపై అంచనాలున్నా.. ప్రేక్షకులను మెప్పించడంలో ఆ సినిమా విఫలమైంది. వరుస ఫెయిల్యూర్ మూవీస్ తర్వాత వచ్చిన ఈగల్ సినిమా అయినా.. రవితేజకు హిట్ ఇచ్చిందో లేదో చూద్దాం. మాస్ మహారాజ్ రవితేజ హీరోగా, అనుపమ పరమేశ్వరన్, కావ్య థాపర్ హీరోయిన్లుగా నటించిన మూవీ 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీని పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్లో టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఇందులో నవదీప్, వినయ్ రాయ్, అవసరాల శ్రీనివాస్, మధుబాలతో సహా పలువురు నటీ నటులు ముఖ్య పాత్రలు పోషించారు. ఇక ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. పోస్టర్స్, టీజర్, సాంగ్స్‌తో మంచి హైప్ క్రియేట్ చేసుకున్న ఈ సినిమా ట్రైలర్‌తో ఆ హైప్‌ను మరింతగా పెంచుకుంది. ఇక సంక్రాంతి బరిలో నిలిచిన ఈ సినిమా థియేటర్లు లేకపోవడంతో సోలో రిలీజ్‌గా నేడు థియేటర్లలోకి వచ్చింది. మరి ఈ సినిమా ఎలా ఉంది? ప్రేక్షకుల అంచనాలను అందుకుందా? లేదా అనేది ఫుల్ రివ్యూలో చూసేద్దాం.

**కథ:**

ఓ ఇంగ్లీష్ పేపర్‌లో జర్నలిస్ట్‌గా పనిచేసే నళిని (అనుపమ పరమేశ్వరన్) అనుకోకుండా అరుదైన పత్తితో నేసిన ఒక స్పెషల్ కాటన్ క్లాత్‌ను చూస్తుంది. దాని గురించి పూర్తిగా తెలుసుకుంటుంది. అయితే ఆ క్లాత్‌కి విపరీతమైన పబ్లిసిటీ చేసి అందుబాటులోకి తీసుకొచ్చిన వ్యక్తి కనబడట్లేదు అని తెలుసుకుంటుంది. దీంతో అదే విషయంపై ఆమె పేపర్లో ఒక చిన్న ఆర్టికల్ రాయడంతో సీబీఐ రంగంలోకి దిగి నళిని పనిచేసే సంస్థపై దాడి చేస్తాయి.దీంతో నళిని జోబ్ పోతుంది. అక్కడ ఆమెకు ఒక డౌట్ మొదలవుతుంది. అంత చిన్న న్యూస్‌కి ఇంతలా అందరూ ఎందుకు రియాక్ట్ అవుతున్నారు అని అనుకుని.. అసలు మిస్సయిన సహదేవ్ వర్మ ఎవరు? అని తెలుసుకునేందుకు నళిని ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లి తాలూకాలో ఉన్న తలకోన ప్రాంతానికి



వెళ్తుంది.ఆ గ్రామంలో ఒక్కొక్కరినీ అడుగుతూ ఆ పత్తి గురించి.. ఆ పత్తిని విదేశాల్లో ఫేమస్ చేసిన సహదేవ్ (రవితేజ) గురించి తెలుసుకుంటుంది. ఈ క్రమంలో అతను ఈగల్ అని.. ప్రపంచ దేశాలు అతని కోసం వెతుకుతున్నారని తెలుసుకుంటుంది. అయితే ఎక్కడో యూరప్‌లో సఫారీ తీసుకుని కాంట్రాక్టు కిల్లింగ్ చేసే స్నైపర్ సహదేవ్ వర్మ తలకోన అడవుల్లో ఏం చేస్తున్నాడు.కాంట్రాక్ట్ కిల్లింగ్స్ ఆపేసి.. పత్తిని పండిస్తూ చేనేత కార్మికులను ముందుకు తీసుకువెళ్లాలని ఎందుకు అనుకున్నాడు?. అతని గురించి పేపర్లో రాస్తే సీబీఐ ఎందుకు కంగారు పడాల్సి వచ్చింది? లాంటి విషయాలు తెలియాలంటే సినిమా మొత్తం చూడాల్సిందే.

**విశ్లేషణ:**

సినిమా మొదటి నుంచి సహదేవ్ (రవితేజ) క్యారెక్టర్ మీద నెమ్మదిగా అంచనాలు పెంచుతూ తీసుకువెళ్లారు. ఫస్ట్ హాఫ్ నుంచి హీరో మీద ఎలివేషన్లు పెంచుతూ చివరి వరకు సినిమా నడిపించారు. కాంట్రాక్ట్ కిల్లింగ్ చూసుకుంటూ డబ్బు సంపాదించే హీరో లైఫ్‌లోకి ఒక హీరోయిన్ వచ్చి ఆమె కోసం మంచిగా మారదామనుకున్న సమయంలో ఆమె చనిపోతే.. ఆమెకోసం అప్పటి వరకు తాను చేసిన పని వదిలేసి అక్రమ ఆయుధాలు అరికట్టడమే పనిగా పెట్టుకుంటాడు.

దానికోసం ఇండియా వ్యాప్తంగా జరిగే అన్ని అక్రమ ఆయుధాల డీలింగ్స్‌లో ఇన్వాల్వ్ అవుతాడు. అక్రమ ఆయుధాలు దుర్మార్గుల చేతికి వెళితే ఎంతోమంది అమాయకుల ప్రాణాలు పోతాయి అనే కాన్సెప్ట్‌తో సినిమాని నడిపించారు. ఒకవిధంగా చెప్పాలంటే.. ఈ కథకి ఒక మంచి మెసేజ్‌ని జోడించి యాక్షన్ సినిమాలా చెప్పారు.ఇక ఈ మూవీలో రవితేజ మార్క్ కామెడీ ఏమాత్రం ఎక్స్పెక్ట్ చేయవద్దు. మునుపటి సినిమాల కంటే ఈ సినిమాలో రవితేజ కాస్త భిన్నంగా కనిపించాడు. ఇక స్క్రీన్ ప్లేని గతం, వర్తమానంలోకి మారుస్తూ కథని చెప్పడంతో కొంచెం కన్ఫ్యూజ్ చేశారు. మొదటి హాఫ్ మొత్తం నళిని.. సహదేవ్ ఎవరు అని తెలుసుకోవడం ఉంటుంది. సెకండ్ హాఫ్‌లో అతని గతం కథని చూపిస్తారు.క్లైమాక్స్ ముందు వచ్చే యాక్షన్ సీన్స్ మాత్రం ఓ రేంజ్‌లో ఉంటాయి. తుపాకులు, ఆయుధాలతో కొత్త కొత్త ప్రయోగాలు చేసారు. ఈ మూవీలో వీటితో చూపించే సీన్స్ బాగున్నాయి. అయితే కొన్ని లాజిక్స్ దూరం అనిపించినా.. ఓవరాల్‌గా సినిమా మొత్తం మీద ఎంగేజ్ చేసే విధంగా ఉంది. అంతేకాకుండా మూవీ చివర్లో ఈ సినిమాకు పోర్ట్ 2 అనౌన్స్ చేయడం గమనార్హం.

**నటీనటుల విషయానికొస్తే..**

మాస్ మహారాజ్ రవితేజ ఎప్పటిలానే అదరగొట్టేశాడు. తన రొటీన్ పాత్రల కంటే భిన్నంగా సహదేవ్ పాత్రలో నటించి ఆకట్టుకున్నాడు. గడ్డంతో కొత్త లుక్‌లో యాక్షన్ సీన్స్‌లో మరింత మెప్పించాడు. ఇక అనుపమ పరమేశ్వరన్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ తరహా పాత్రలో పర్వాలేదనిపించుకుంది. రవితేజ సరసన కావ్య థాపర్ లవ్ సన్నివేశాల్లో చాలా అందంగా, క్యూట్‌గా కనిపించి అలరించింది.అలాగే నవదీప్‌కి చాలా రోజుల తర్వాత ఫుల్ లెంత్ పాత్రలో కనిపించాడు. వినయ్ రాయ్ పాత్ర చిన్నదైనా తన పాత్ర పరిధి మేరకు నటించి మెప్పించాడు. రా ఆఫీసర్స్‌గా అవసరాల శ్రీనివాస్, మధుబాల మెప్పిస్తారు. ఊరి ఎమ్మెల్యేగా అజయ్ ఘోష్ అక్కడక్కడా తన కామెడీతో అలరిస్తాడు.కార్తీక్ ఘట్టమనేని సినిమాటోగ్రఫర్ నుంచి దర్శకుడిగా మారడంతో విజువల్స్ మాత్రం చాలా అద్భుతంగా, స్టైలిష్‌గా ఉన్నాయి. బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అదరిపోతుంది. సాంగ్స్ యావరేజ్ అనిపిస్తాయి. కొన్ని సీన్స్‌లో ఆర్ట్ డైరెక్టర్ చేసిన ఆర్ట్ వర్క్‌ని మెచ్చుకోవల్సిందే. సినిమా కోసం నిర్మాత టీజీ విశ్వప్రశాద్ పెట్టిన ఖర్చు స్క్రీన్‌పై కనిపిస్తుంది. మణిబాబు రాసిన డైలాగ్స్ ఆకట్టుకునే విధంగా ఉన్నాయి.ఓవరాల్‌గా చెప్పాలంటే ఈగల్ మూవీ ఒక స్టైలిష్ అండ్ ఎంగేజింగ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ అనే చెప్పాలి.

---

అటు తమిళంతో పాటు ఇటు తెలుగు ప్రేక్షకులకూ పరిచయం ఉన్న కథానాయకుడు శివకార్తికేయన్. రెమో సినిమాతో తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడైన శివకార్తికేయన్.. ఆ తర్వాత నటించిన సినిమాలన్నింటినీ తెలుగులోనూ విడుదల చేస్తూ వచ్చారు. తాజాగా గ్రహాంతరవాసి కాన్సెప్ట్ తో తీసిన అయలాన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. నిజానికి సంక్రాంతికే ఈ సినిమా విడుదల కావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో తప్పుకోక తప్పలేదు. తమిళనంలో ముందే విడుదలై మంచి టాక్ వచ్చినా.. తెలుగులో రిలీజ్ కు ముందే ఓటీటీలోకి కూడా వచ్చేసింది. మరి .. గ్రహాంతరవాసి కాన్సెప్ట్ తో వచ్చిన శివకార్తికేయన్ హిట్ అందుకున్నాడా లేదా చూద్దాం.

చిత్రం : అయలాన్
నటీనటులు : శివకార్తికేయన్, వెంకటేష్ సెంగుత్తువాన్, రకుల్ ప్రీత్, శరద్ ఖేల్కర్, ఇషా కొప్పికర్, కరుణాకరన్, యోగిబాబు తదితరులు
సంగీతం : ఏఆర్ రెహమాన్
సినిమాటోగ్రఫీ : నీరవ్ షా
ఎడిటింగ్ : రూబెన్
నిర్మాత : కొట్టపాడి జె.రాజేశ్
రచన, డైరెక్షన్ : ఆర్.రవికుమార్
స్ట్రీమింగ్ పార్ట్నర్ : సన్ నెక్ట్స్




**కథలోకి వెళ్తే..**

తామిజ్‌ఒ క సాధారణ రైతు. ప్రకృతికి నష్టం జరగకుండా.. తనకూ నష్టాలు రాకుండా.. ఒక సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేస్తుంటాడు. సహజ ఎరువులతో వ్యవసాయం చేసినా.. తనకు లాభాలకంటే నష్టాలే ఎక్కువ వస్తుంటాయి. ఆశించిన స్థాయిలో దిగుబడి లేక.. అప్పులు పెరిగిపోతుండటంతో.. అతని తల్లి ఉద్యోగం చేయాలని సిటీకి పంపిస్తుంది. అదే సమయంలో.. వాహనాలకు ఫ్యూయల్ కు ప్రత్యామ్నాయంగా నోవా గ్యాస్ ను కనిపెట్టే ప్రయత్నాల్లో ఉంటాడు సైంటిస్ట్ ఆర్యన్ గ్యాస్ ను వెలికి తీసేందుకు స్పార్క్ అనే గ్రహ శకలాన్ని ఉపయోగిస్తుంటాడు. ఆఫ్రికాలో అతను చేసిన ప్రయోగం వికటించడంతో.. వందలాదిమంది ప్రాణాలు కోల్పోవడంతో ఇండియాలో సీక్రెట్‌లో ఒక మైన్ లో తన ప్రయోగాన్ని కొనసాగిస్తుంటాడు. ఈ క్రమంలో ఆర్యన్ వద్ద ఉన్న స్పార్క్ కోసం.. మరో గ్రహం కోసం టాట్టూ అనే ఏలియన్ భూమ్మీదికి వస్తుంది. ఆ ఏలియన్ తామిజ్ ను ఎలా కలిసింది.. ?ఆర్యన్ గ్యాంగ్ తో ఏలియన్ కు ఎలాంటి సమస్య వచ్చింది. సైంటిస్ట్ ప్రయోగంతో చెన్నైకి వచ్చిన ముప్పేంటి ? అన్న విషయాలు తెలియాలంటే తెరపై పూర్తి సినిమా చూడాల్సిందే.

**ఎలా ఉంది ?**

సినిమా ఇండస్ట్రీకి ఏలియన్ కాన్సెప్ట్ తో సినిమాలు కొత్తేం కాదు. కాకపోతే ఇవి ఎక్కువగా హాలీవుడ్ లోనే దర్శనమిస్తాయి తప్ప.. టాలీవుడ్, మాలీవుడ్, కోలీవుడ్ లలో చాలా తక్కువ. అందుకే ఇలాంటి సినిమాల్లో కంటెంట్ ఉంటే గానీ ప్రేక్షకులు కనెక్ట్ అవరు. ఒక ఏలియన్ కథతో.. అయలాన్ సినిమా తీసి.. డైరెక్టర్ రవికుమార్ ప్రేక్షకులు కావలసినంత వినోదాన్ని పంచారు. తమిళ్ మూవీ కావడంతో.. అక్కడక్కడా కాస్త ఓవర్ గా ఉన్నట్లు అనిపించడం కామన్. హీరో ఇంట్రడక్షన్, ఎంట్రీ సాంగ్, డైలాగ్స్ రొటీన్ గానే ఉంటాయి. మొదట్లో సినిమా కాస్త సాగదీతగానే ఉన్న.. ఏలియన్ కథలోకి వచ్చాక ఇంట్రస్టింగ్ గా మారుతుంది. కోయి మిల్ గయా సినిమాలో ఏలియన్ నుంచి హీరోకు శక్తులు రావడం వంటి కాన్సెప్ట్ ను చూపించారు. శివకార్తికేయని వన్ మ్యాన్ షో అయలాన్. తామిజ్ క్యారెక్టర్ కు తను పూర్తి న్యాయం చేశాడు.

**ప్లస్ పాయింట్స్**

శివకార్తికేయన్, టట్టూ, డైరెక్షన్

**మైనస్ పాయింట్స్**

అక్కడక్కడా కాస్త ఓవర్ గా అనిపించే సీన్స్

ఒక్కమాటలో చెప్పాలంటే.. అయలాన్ అందరినీ ఎంటర్టైన్ చేస్తుంది.

(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)


నిర్వహణ :
స్వర్ణకంకణ సన్మానిత,
జ్యోతిష్య చూడామణి,
జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద
డా॥ఈడ్పుగంటి
పద్మజారాణి



91 9849250852,
91 7506976164
padma.suryapaper@gmail.com


# 11.2.2024 నుంచి 70.2.2024 వరకు



## మేష రాశి

అశ్విని 1,2,3,4 పాదములు , భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదము

వారం ప్రారంభంలో విద్యార్థులు చాలా శ్రమ పడతారు. జ్ఞాపకశక్తి పెంచుకోవాలి. చిన్న నాటి మిత్రులను కలుస్తారు. విద్యాపరమైన అంశాలలో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కొన్ని విషయాలలో శ్రమకు తగిన ఫలితాలు వస్తుంది. భాగస్వామికి ఆధ్యాత్మికపరమైన అంశాలలో, సాంఘిక పరమైన విషయాలలో అభివృద్ధి ఉంటుంది. స్త్రీలకు ఆదాయం అభివృద్ధి కరంగా ఉంటుంది. సంతానమునకు వృత్తిపరమైన అవకాశాలు, ఉన్నత అధికారుల సహాయ సహకారాలు కొంత ప్రయత్నం మీద కష్టంగా అందుతాయి. భూ సంబంధిత వారసత్వ అంశాలలో సోదర వర్గంతో సమావేశాలు, వారం మధ్యలో గవర్నమెంట్ సంబంధిత విషయాలలో రావలసిన లాభాలు కొంత ఆలస్యం ఆటంకం. వృత్తిపరంగా అధికారంలో ఉండే స్త్రీల సహకారాలు పొందుతారు.



## వృషభరాశి

కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు

వారం ప్రారంభంలో వృత్తిపరమైన బాధ్యతలు అధికంగా ఉంటాయి శ్రమ ఎక్కువగా ఉంటుంది మిత్రులు, తోబుట్టు ల సహకారంతో కష్టం మీద పనులు నెరవేర్చుకుంటారు. విద్యార్థులు అధిక శ్రమతో ఆశించిన ఫలితాలను పొందుతారు. ఆరోగ్యం మీద శ్రద్ధ పెరుగుతుంది. అలంకరణ వస్తువులు కొంటారు. వారం మధ్యలో కుటుంబంలోని స్త్రీల సహకారం పొందుతారు. ఉన్నత అధికారుల సాయం కొరకు చేయు ప్రయత్నాలలో ఆలస్యం ఆటంకం ఇబ్బంది కలిగిస్తుంది వారం మధ్యలో భాగస్వామితో అపార్థాలు రాకుండా జాగ్రత్త వహించాలి. దూర ప్రదేశాలలో ఉండే చిన్ననాటి మిత్రుల సహకారం బాగుంటుంది. ఒక వార్త ఆనందాన్ని కలిగిస్తుంది. విదేశీ ఉపాధి కొరకు ప్రయత్నాలు చేస్తారు. వారము చివరిలో ఆత్మీయులైన వ్యక్తుల కొరకు ఖర్చు అధికము



## మిథున రాశి

మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో విశ్రాంతి లేని పనుల వల్ల వాటి ఫలితాల వలన కొంత అసంతృప్తి ఉంటుంది. ఆర్థికపరమైన విషయాలలో కుటుంబ పెద్దల సహకారాన్ని ఆశిస్తారు. భాగస్వామితో, సంతానముతో అపార్థములు రాకుండా ఆలోచించి మాట్లాడాలి. ఉపాసనాపరమైన అంశాలలో కొన్ని అవరోధాలు ఎదుర్కొంటారు. ప్రయాణాలు కొంత చికాకును కలిగిస్తాయి. వారం మధ్యలో కమ్యూనికేషన్ విషయాలలో ఆత్మీయ ల మధ్య కొన్ని రకాలైన చికాకులు ఇబ్బంది పడతాయి. ముఖ్యమైన విషయాలకి మధ్యవర్తిత్వం మంచిది కాదు. వారం చివరిలో వృత్తిపరంగా రావలసిన ఆదాయాన్ని అందుకుంటారు, నూతన వృత్తుల కొరకు ప్రయత్నాలు చేస్తారు. బహుమాన రూపంలో ఖర్చులు అధికంగా చేస్తారు.



## కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో ఆరోగ్య విషయాలు తీసుకోవాలి ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి ప్రతి విషయంలోను ఆలస్యాలు ఆటంకాలు చికాకును కలిగిస్తాయి. సంబంధము లేని విమర్శలు మనసుని ఇబ్బంది పెడతాయి. సంఘంలో గౌరవం, వృత్తిపరమైన అభివృద్ధి, నూతన వ్యక్తుల పరిచయాలు, సంతానమునకు కొత్త అవకాశాలు ఉన్నప్పటికీ వారము మధ్యలో మీ మాటల వల్ల కుటుంబ సభ్యులలో అపార్థాలకు అవకాశము. స్త్రీల తో ఘర్షణలు రాకుండా జాగ్రత్త పడాలి. స్థిరాస్తుల అంశాలలో రియల్ ఎస్టేట్ రంగంలో వారితో మెలకువగా వ్యవహరించాలి. పరిచయస్తులు మోసం చేసేందుకు అవకాశం ఉంది. వారము చివరిలో మానసిక ప్రశాంతత తగ్గుతుంది. వృత్తిపరంగా నూతన ప్రయత్నాలు, పెద్దల సహకారం.



## సింహ రాశి

మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము

వార ప్రారంభంలో చాలా ఉత్సాహంగా ఉంటారు భాగస్వామికి సంబంధించిన ఖర్చు అధికంగా ఉంటాయి సంఘంలో పలుకుబడి పెరుగుతుంది సామాజిక సేవ చేస్తారు. నూతన వ్యక్తుల పరిచయాలు. విద్యార్థులకు పోటీ తత్వం పెరుగుతుంది. శ్రమకి తగిన ఫలితాన్ని పొందుతారు. ఆరోగ్య మీద శ్రద్ధ అధికంగా ఉంటుంది రోగనిరోధక శక్తిని పెంచుకుంటారు రుణములు చెల్లిస్తారు కొత్తరుణం కొరకు ప్రయత్నం చేస్తారు. సేవకులు సహకరిస్తారు. కుటుంబంలోని వ్యక్తులకు నూతన వృత్తిలో అవకాశాలు. సంతానానికి అభివృద్ధి. ఆత్మీయులైన మిత్రులతోనూ సోదరీ వర్గంతోనూ సమావేశాలు చర్చలు. కొత్త బహుమానాలు అందుకుంటారు. వారం మధ్యలో ఆరోగ్యమే శ్రద్ధ అవసరము, మానసిక ప్రశాంతత తగ్గుతుంది ఆకస్మిక అనవసరమైన ప్రయాణాలు



## కన్యా రాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు

వారం ప్రారంభంలో రావలసిన రుణములు అందుకుంటారు. విద్యార్థులు గట్టి శ్రమ మీద పరీక్షలకు సిద్ధం అవుతారు. సంతానము అభివృద్ధి కరంగా ఉంటుంది. గవర్నమెంట్ వృత్తుల కొరకు పోటీ పరీక్షలకు సంతానము చేయు ప్రయత్నా ల కు మీ ఆత్మీయుల సహకారం తోడ్పాటు అందిస్తారు. వారం మధ్యలో ముఖ్యముగా స్త్రీ సంతానం వృత్తిపరంగా చేసే ప్రయత్నాలలో అభివృద్ధికరంగా ఉంటుంది. ఉన్నత అధికారులతో విభేదాలు రాకుండా జాగ్రత్త వహించాలి. విదేశాల కొరకు ఆహ్వానాలని అందుకుంటారు. వారం చివరిలో భాగస్వామి మరియు తల్లి ఆరోగ్యం మీద శ్రద్ధ వహించాలి. రీసర్చ్ చేయు విద్యార్థులకు అనుకూలంగా ఉంటుంది. చేయి ప్రయత్నాలు సంతృప్తికరంగా ముందుకు సాగుతాయి.



## తులారాశి

చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో వృత్తిపరంగా శ్రమ బాధ్యత అధికంగా ఉన్నప్పటికీ తగిన గుర్తింపుని గౌరవాన్ని పొందుతారు నూతన ప్రయత్నాలు చేస్తారు. విద్యాపరమైన విషయాలలో విద్యార్థులు చాలా శ్రమ పడతారు. సమయానికి ఆహార స్వీకరణ మంచిది తగిన విశ్రాంతి అవసరము. జ్ఞాపక శక్తిని మెరుగుపరుచుకునే విషయాల్లో శ్రద్ధ వహించాలి ఉపాసన అంశాలలో కొన్ని అవరోధాలు చికాకును కలిగిస్తాయి. ఆర్థిక విషయాలలో స్థిరాస్తుల అంశాలలో వా తావరణం కొంత చికాకుగా ఉన్నప్పటికీ, పెద్ద ల సహకారంతో దాన్ని అధిగమిస్తారు. భాగస్వామి వృత్తిపరమైన విషయాలలో కొంత అభివృద్ధి మీకు సంతోషాన్ని కలిగిస్తుంది. నూతన వాహన గృహ కొనుగోలు కొరకు ఆలోచనలు అధికం చేస్తారు.



## వృశ్చిక రాశి

విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ట 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో గృహాల్లో ముఖ్యమైన కార్యక్రమాలు ఆలస్యాలు, వాహనములకు సంబంధించిన చిన్నపాటి రిపేర్లు. స్థిరాస్తులు అంశములలో సోదరీ వర్గంతో కొంత ఘర్షణాత్మకమైన వాతావరణం, భాగస్వామికి ఆదాయం అభివృద్ధి, వృత్తిపరమైన విషయాలలో ఉన్నత అధికారుల సహకారం, కింద పని చేస్తే సిబ్బంది సహాయం, ఆకస్మికమైన విషయాలలో కొంత లాభం, శుభకార్యాలకు ఆహ్వానాలు, వారం మధ్యలో మిత్రులను కలుస్తారు. వృత్తిపరమైన విషయాలలో సోషల్ మీడియాలో పెట్టుబడి పెడతారు. స్త్రీల సహకారాన్ని పొందుతారు. భాగస్వామికి గుర్తింపు గౌరవం లభిస్తుంది. విదేశాలలో ఉండే వ్యక్తుల సహకారం లభిస్తుంది. వారి వ్యాపార పరంగా అభివృద్ధి. వృత్తిపరంగా నూతన పెట్టుబడుల కొరకు ఆలోచనలు చేస్తారు.



## ధనస్సు రాశి

మూల 1,2,3,4 పాదములు పూర్వాషాఢ 1,2,3,4 పాదములు ఉత్తరషాడ 1వ పాదము

వారం ప్రారంభం సంతోషంగా ఉంటుంది, మిత్రులు తోబుట్టువులు సహకరిస్తారు కమ్యూనికేషన్ బాగుంటుంది ఆత్మీయులతో కలిసి మంచి వాతావరణంలో చిన్నపాటి ప్రయాణాలు గెట్ టుగెదర్లు. మాటలతో అందరినీ ఆకట్టుకుంటారు. సమయస్ఫూర్తి నిర్ణయాలు తీసుకుంటారు. శారీరక శ్రద్ధ ఆకర్షణ పెరుగుతాయి. కళాకారులకు గుర్తింపు. వారం మధ్యలో విద్యార్థులు విద్య మీద ఎక్కువ శ్రద్ధ పెట్టాలి అనవసర విషయాలకు దూరంగా ఉండాలి. కుటుంబ వాతావరణం కొంత ఘర్షణాత్మకంగా ఉంటుంది. ఆకస్మిక ఖర్చులు పెరుగుతాయి. వృత్తిపరమైన , భూ సంబంధ అంశములలో ఉన్నత అధికారులతో ఆచితూచి వ్యవహరించాలి. వాదనలకు దూరంగా ఉండాలి. పోటీ తత్వం ధైర్యసాహసాలు పెరుగుతాయి.



## మకర రాశి

ఉత్తరషాడ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ట 1,2 పాదములు

వారం ప్రారంభంలో మాటల వల్ల అపార్థాలు రాకుండా జాగ్రత్త వహించాలి రావలసినదనం సమయానికి అందడంలో కొంత ఆలస్యం ఆటంకం నిరాశను కలిగిస్తుంది కోపాన్ని నియంత్రించుకోవాలి. వృత్తిపరంగా ఉన్నతాధికారులతో వాగ్వాదాలకు లోను కాకుండా సమయస్ఫూర్తిగా వ్యవహరించాలి. వృత్తిపరంగా అధిక శ్రమ బాధ్యతలు పెరగడం వల్ల సమయానికి ఆహార స్వీకరణ విశ్రాంతి విషయాల్లో శ్రద్ధ వహించాలి. వారం మధ్యలో సామరస్యంగా పనులను వ్యక్తుల సహకారంతో సమస్యలను పరిష్కరించుకుంటూ ధైర్యంగా నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు వెళతారు. భాగస్వామి సహాయ సహకారాలు అందుకుంటారు. విదేశీ ఆదాయాన్ని, బాగస్వామి తరపున విదేశాలలో ఉన్న ఆత్మీయుల సహాయాన్ని సమయానికి పొందగలుగుతారు



## కుంభ రాశి

ధనిష్ట 3,4 పాదములు శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో మనసుకు కొంత ఆహ్లాదకరంగా ఉంటుంది, విందు వినదాల్లో పాల్గొంటారు నూ తన ప్రణాళికల కొరకు ఆలోచనలు చేస్తారు. తల్లితండ్రుల సహకారం లభిస్తుం ది నూతన పెట్టుబడుల కొరకు గృహ వాహన మార్పుల కొరకు ఆలోచనలు చేస్తారు. ఇచ్చిన రుణములు తిరిగి రావడం కొంత కష్టం. బాగ స్వామికి వృత్తిపరమైన విషయా లలో అధిక శ్రమ నూతన బాధ్యతలు. అధికారుల సహకా రంలో ఆశించిన స్థాయిలో లేకపోవడం వల్ల కొంత నిరాశ ఎదురవుతుంది. సంతానము ఎక్కువ శ్రమతో ఆశించిన ఫలితములు, విద్యార్థులకు ఎలక్ట్రానిక్ సంబంధిత వస్తువుల కొరకు ఖర్చులు అధికంగా ఉంటాయి. కాంపిటీటివ్ ఎగ్జామ్స్ కొరకు ప్రయత్నం చేయు విద్యార్థులు శ్రమ అధికం చేస్తారు. నూతన కళాశాలలలో ప్రవేశం ప్రయత్నాలు నెరవేరుతాయి.



## మీనరాశి

పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాబాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో రావలసిన లాభాలు ఆదాయం అందడంలో కొంత ఆలస్యాలు ఆటంకాలు ఉన్నప్పటికీ సంతానం కొరకు అధిక ఖర్చులు చేస్తారు. వృత్తిపరమైన విషయాలు వ్యాపారలవాదేవిలు కుటుంబ,గృహ, వాహన, భాగస్వామ్య అంశాలు చాలా వరకు మీకు అనుకూలంగా ఉంటాయి. వృత్తిలో అధికారంలో ఉండే వ్యక్తుల సహకారం కొంత నిరాశ కల్పించినప్పటికీ వారం మధ్యలో అనుకూలతే సిద్ధిస్తుంది. సంఘంలో గౌరవము మర్యాద కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. సంతానమునకు అభివృద్ధి విదేశీ అవకాశాలు విద్యలో ముందు ఉండడం మీకు కొంత ఆనందాన్నిస్తుంది. వారం మధ్యలో లకు కళాకారులకు అనుకూలమైన సమయం. రోగనిరోధక శక్తిని పెంచుకోవాలి గవర్నమెంట్ సంబంధిత టాక్సును చెల్లిస్తారు,


అనుపమ
పరమేశ్వరన్